నవతెలంగాణ 1
మెదక్
శనివారం | 19 అక్టోబర్ 2024 | www.navatelangana.com

అటవీ కళాశాల పరిశోధన సంస్థలో పాములపై అవగాహన



నవతెలంగాణ-ములుగు : సిద్దిపేట జిల్లా ములుగు మండలం కేంద్రంలోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ (ఎఫ్.సి.ఆర్.ఐ)లో ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పాములపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు గంటల పాటు జరిగిన అవగాహన కార్యక్రమంలో భాగంగా విష సర్పాలను, విషం లేని సర్పాలను గుర్తించడం, పాము కాటుకు ప్రథమ చికిత్స చేయడాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అటవీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఎస్. శ్రీనిధి మాట్లాడుతూ 'సమాజంలో సర్పాలంటే అందరికీ ప్రతికూల భావన ఉంది, పాములన్నీ ప్రమాదకరమైనవి కావు. కేవలం కొన్ని రకాల పాములు మాత్రమే విషపూరితమైనవి, మిగిలిన అనేక రకాల పాములు పంటలను నాశనం చేసే ఎలుకలను, ఇతర కీటకాలను తిని పర్యావరణాన్ని పరిరక్షిస్తూ రైతులకు మేలు చేస్తున్నాయి. పాము కరిచినపుడు ప్రథమ చికిత్స చాలా ముఖ్యమైనది. మనం బ్రతుకుతూ ఇతర జీవరాశులను బ్రతకనిద్దాం, పాములను రక్షించుకుందాం, పర్యావరణాన్ని కాపాడుకుందాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో 120 మంది పైగా ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు, కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు


నవతెలంగాణ-సదాశివపేట



సదాశివపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గతనెల 11న గంజాయి తరలిస్తుండగా ఇద్దరు నిందితులను పోలీసులు పట్టుకోగా.. ఓ నిందితుడు కాల కృత్యాలకు పోతానని చెప్పి నైట్ ఏస్కాట్ పోలీసులను గాయపరిచి తప్పించుకున్నాడు. ఆ నిందితుడు ఒరిస్సా రాష్ట్రానికి పారిపోగా.. అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చి సదాశివపేట పోలీసులు పట్టుకున్నారు. దాంతో నిందితుడిపై గంజాయి కేసుతో పాటు, పోలీసులను గాయపరిచి పారిపోయినందున, రెండు కేసులు పెట్టి కస్టడీకి తరలిస్తున్నామని సదాశివపేట ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ తెలిపారు.

ప్రజా పోరాటాల సారధి... సీపీఐఎం

- సంగారెడ్డి జిల్లా సమగ్రాభివృద్ధి సాధనకై పోరు
- తాగు, సాగునీటి ప్రాజెక్టులు పట్టని పాలకులు
- పరిశ్రమలొచ్చినా పేదలు బాగుపడలే
- మెట్రో, పెండింగ్ రైల్వే ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం
- మూడేళ్ల ఉద్యమ కార్యాచరణపై మహాసభల్లో సమీక్ష
- నవతెలంగాణతో సీపీఐఎం జిల్లా కార్యదర్శి జయరాజు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా పోరాటాల సారధిగా సీపీఐఎం పీడిత జనం పక్షాన నిరంతర ఉద్యమాలు సాగిస్తుందని సీపీఐఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. జహీరాబాద్ పట్టణంలో ఈ నెల 19, 20 తేదీల్లో (ప్రకాశ్ నగర్)లో నిర్వహించనున్న ఆ పార్టీ జిల్లా 3వ మహాసభల సందర్భంగా ఆయన నవతెలంగాణ ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా సమగ్రాభివృద్ధి, తాగు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పేదల సంక్షేమం, మెట్రో విస్తరణ, రైల్వే ప్రాజెక్టుల వంటి అభివృద్ధితో పాటు సామాజిక వివక్షతపై గత మూడేళ్ల కాలంలో సీపీఐఎం నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలకు సంబంధించిన అంశాలను ఆయన వివరించారు.

పారిశ్రామికంగా విస్తరిస్తున్న సంగారెడ్డి జిల్లా ఇప్పటికీ అభివృద్ధిలో వెనకబడే ఉందన్నారు. పరిశ్రమల మాటున లక్షలాది మంది పేదల బతుకుల్ని పాలకులు పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగు, సాగునీటి ప్రాజెక్టులు, మెట్రో విస్తరణ, పెండింగ్ రైల్వే లైన్ల పనుల విషయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఐఎం సుదీర్ఘ పాదయాత్ర నిర్వహించిందన్నారు. ఆ సందర్భంగా ప్రతి మారుమూల పల్లెల్ని సైతం పర్యటించిన సీపీఐఎం బృందం జిల్లా అభివృద్ధి కోసం చేపట్టాల్సిన సమగ్ర ప్రణాళికల్ని పాలకులకు ప్రతిపాదించినట్టు తెలిపారు. స్వరాష్ట్రంలో సైతం సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికీ నారాయణఖేడ్ ప్రాంతం ఎంతో వెనుకబడి ఉందన్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి ప్రాంతాల్లో లక్షలాది ఎకరాలు సాగునీటికి నోచక బీడు భూములుగానే పడి ఉన్నాయన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల, నల్లవాగు, సింగూరు కాల్వల వంటి పనుల్ని పూర్తి చేయాలని సీపీఐఎం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్న పరిస్థితి ఉందన్నారు. వెనుకబడిన నారాయణఖేడ్ ప్రాంతానికి రూ.5 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి అభివృద్ధి చేయాలని సీపీఐఎం డిమాండ్ చేస్తూ పోరాడిందన్నారు. పారిశ్రామిక ప్రాంతాలుగా ఉన్న పటాన్‌చెరు, జహీరాబాద్, సంగారెడ్డి ఏరియాల్లో పేదల జీవితాలు దుర్భరమైన పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. రక్షిత మంచినీరు, రోడ్లు, ఇతర సదుపాయాల్లేవన్నారు. ముఖ్యంగా వలస కార్మికులు రేకుల షెడ్లల్లో అధ్వాన్నమైన పరిస్థితుల్లో తలదాచుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కేంద్రం లేబర్ కోడ్‌లు తెచ్చి లక్షలాది మంది కార్మికుల జీవితాల్ని వీధిన పడేయాలని చూస్తుందన్నారు. ఎర్రజెండా పోరాడిన ఫలితంగానే కొన్ని పరిశ్రమల్లోనైనా కనీస వేతనాలు, సదుపాయాలు అందుతున్నాయన్నారు. సంగారెడ్డి వరకు మెట్రోలైన విస్తరణ, జహీరాబాద్, ఆందోల్ ఏరియాల్లో రైల్వే ప్రాజెక్టుల పనుల కోసం సీపీఐఎం అనేక రూపాల్లో పోరాడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర స్థాయి మంత్రులు, అధికారుల్ని కలిసి విన్నవించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కూలీలకు వంద రోజుల పనిదినాలు, దినసరి వేతనం పెంపు కోసం కొట్లాడిన ఫలితంగానే కొంత మేరకు పెరిగాయన్నారు. ఇప్పటికీ సంగారెడ్డి, సదాశివపేట, పటాన్‌చెరు, జహీరాబరాద్, నారాయణఖేడ్, అందోల్ వంటి పట్టణాల్లో వేలాది కుటుంబాలు సొంత ఇళ్లులేక ఇబ్బందులు పడుతున్నాయని, వారందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలివ్వాలని సీపీఐఎం పోరాడుతుందన్నారు. బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధిపొందుతుందన్నారు. లౌకిక విధానాలకు కట్టుబడిన సీపీఐఎం మతసామరస్యం కోసం పాటుపడుతుందన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికీ కుల వివక్షత, బహిష్కరణలు, దాడులు, హత్యల వంటి దుర్మార్గాలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో సంగారెడ్డి జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం మరింత సమరశీలంగా ఉద్యమాలు నిర్వహించేందుకు పార్టీ 3వ మహాసభల్లో ప్రతినిధులు చర్చిస్తారని తెలిపారు. శనివారం 11 గంటలకు జహీరాబాద్ పట్టణంలోని గంజి నుంచి షేట్కర్ పంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ ర్యాలీ, బహిరంగ సభకు పార్టీ శ్రేణులు జిల్లా వ్యాప్తగా తరలి వస్తారని తెలిపారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభకు సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య చుక్క రాములు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు. ఈ సభల్లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మల్లేశం, రామచంద్రం, అతిమేల మాణిక్యం, జి.సాయిలు పాల్గొంటారని తెలిపారు. అనంతరం ఎంపిక చేయబడిన పార్టీ ప్రతినిధుల మహాసభలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ప్రతినిధుల మహాసభల్లో జిల్లా రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాల్లో మరింత సమరశీలంగా ఉద్యమించేందుకు అవసరమైన భవిష్యత్ కర్తవ్యాలు రూపొందిబడతాయన్నారు.



ప్రజా సమస్యలపై... సమరశీల పోరాటాలు

- రైతులు, కూలీల సమస్యలపై నిరంతర పోరు
- కనీస వేతనాలు, సదుయాల కోసం కార్మికుల పక్షాన...
- వివక్ష, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమం
- సమస్య ఎక్కడుంటే...ఎర్ర జెండా అక్కడ
- నేడు జహీరాబాద్‌లో సీపీఎం జిల్లా 3వ మహాసభలు ప్రారంభం
- పట్టణంలో భారీ ర్యాలీ... షేట్కర్ పంక్షన్‌హాల్‌లో సభలు
- ముస్తాబైన జహీరాబాద్...ఎర్ర జెండా రెపరెపలు

'సమస్య ఎక్కడుంటే...ఎర్ర జెండా అక్కడుంటది. పీడిత ప్రజల గొంతుకై ప్రశ్నిస్తది. ఆర్థిక దోపిడి, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా సమర శంఖాన్ని పూరిస్తది. సహజవనరులు, సంపదపై అందరికీ సమాన వాటా దక్కాలని నినదిస్తది. కుల, మతోన్మాద పోకడల్ని ఎదిరిస్తది. సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని కోరుకుంటది. మహోన్నతమైన 'మార్క్సిజం-లెనినిజం' సిద్ధాంతం కల్గిన సీపీఎం ప్రజా సమస్యల పరిష్కారం సమరశీలంగా పోరాడుతోంది. సంగారెడ్డి జిల్లా సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అనేక పోరాటాలు సాగించి విజయాలు సాధించింది. ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పోరాటాలు సాగిస్తుంది. కార్మికులు, రైతులు, కూలీలు, పేదలు, దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలకు సంబంధించిన సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఉద్యమాలు, ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్న సీపీఎం తన సంస్థాగత నిర్మాణంలో భాగంగా శాఖ నుంచి మండల, ఏరియా, జిల్లా, రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తోంది. జహీరాబాద్ పట్టణంలో 19, 20 తేదీల్లో జిల్లా 3వ మహాసభలు జరగనున్నాయి. మహాసభల నిర్వహణ కోసం ఆహ్వాన సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఎర్రజెండాల రెపరెపలతో జహీరాబాద్ పట్టణం ముస్తాబైంది.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పోరాటాలు-విజయాలు

గత మహాసభ నుంచి ఇప్పటి వరకు సీపీఎం జిల్లా కమిటీ అనేక పోరాటాలు నిర్వహించింది. కార్మికులకు కనీస వేతనాలు, సదుపాయాలు కల్పించాలని, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం అనేక సమరశీల పోరాటాలు సాగించి విజయాలు సాధించింది. ముఖ్యంగా జహీరాబాద్, పటాన్‌చెరు, సంగారెడ్డి ఏరియాల్లో ఉన్న వేలాది పరిశ్రమల్లో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికుల పక్షాన ఎర్రజెండా నికరంగా నిలబడి పోరాడుతోంది. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, పని ప్రాంతంలో సదుపాయాలు కల్పించాలని కొట్లాడింది. వందలాది పరిశ్రమల్లో ఎర్రజెండా పోరాటాల ఫలితంగానే కార్మికులకు గౌరవప్రదమైన వేతనాలు లభిస్తున్నాయి. పటాన్‌చెరు, బొల్లారం, బొంతపల్లి, పాశమైలారం, హత్నూర, కొండాపూర్, సదాశివపేట వంటి ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగిన సంఘటనలపై ఎర్రజెండా బాధితుల పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడింది. వలస కార్మికుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. కాంట్రాక్టు వ్యవస్థలను రద్దు చేయాలని కొట్లాడింది. అంగన్వాడీ, ఆశాలు, మధ్యాహ్న భోజన, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్, భవన నిర్మాణ, మున్సిపల్, గ్రామ పంచాయతీ, ఆసుపత్రుల్లో పనిచేసే కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు సాధించడమే కాకుండా కొన్ని విజయాల్ని కూడా సాధించి పెట్టింది. అనేక పరిశ్రమల్లో ఎర్రజెండా నాయకత్వాన గుర్తింపు ఎన్నికల్లోనూ విజయబావుట ఎగరేస్తోంది. మరో పక్క రైతాంగం ఎదుర్కొంటున్న భూ సమస్యలపై సమరశీలంగా కొట్లాడింది. జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్ ప్రాజెక్టు పేర వేలాది ఎకరాల్ని బలవంతంగా సేకరిస్తున్న పాలకులకు వ్యతిరేకంగా రైతాంగాన్ని సమీకరించి సీపీఎం పోరాడింది. ఐదేళ్ల పాటు పట్టువదలకుండా కొట్లాడింది. న్యాయపరంగా పోరాటం చేసి రైతులకు న్యాయమైన పరిహారం అందేలా సీపీఎం ఘననీయమైన పాత్ర పోషించింది. ధరణి సమస్యల్ని ఎత్తిచూపుతూ పరిష్కారం కోసం కొట్లాడింది. ట్రిబుల్ ఆర్ పేర సంగారెడ్డి, కొండాపూర్, సదాశివపేట, కంది ప్రాంతాల్లో నిర్వాసితులైన రైతుల పక్షాన సీపీఎం నిలబడి కొట్లాడింది. న్యాల్‌కల్‌లో ఫార్మా సిటీ పేర పచ్చని పొలాలు, పల్లెటూర్లను పాడు చేయొద్దంటూ సీపీఎం రైతుల పక్షాన నిలబడింది. మాందాపూర్, మునిదేవునిపల్లి రైతుల భూములకు పట్టాదారు పాసుపుస్తకాలివ్వాలని పాదయాత్ర సాగించింది. అత్యధికంగా ఉన్న దళితుల పట్ల కొనసాగుతున్న వివక్ష, అణచివేతకు వ్యతిరేకంగా సీపీఎం బలంగా పోరాడింది. కోహీర్, సదాశివపేట, నారాయణఖేడ్ ఇతర ప్రాంతాల్లో దళితుల పట్ల వివక్ష చూపడం, హత్యలు, బహిష్కరణ చేయడం వంటి సామాజిక రుగ్మతులకు వ్యతిరేకంగా సీపీఎం కొట్లాడింది. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా నిలబడింది. నింధితుల్ని కఠినంగా శిక్షించాలని ఆందోళనలు సాగించింది. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న సంగారెడ్డి జిల్లాలో ఇప్పటికీ భూస్వామ్య భావజాలం బలంగా ఉండడంతో కుల వివక్ష కొనసాగుతున్న పరిస్థితి ఉంది. సామాజిక సంఘాల్ని సమీకరించి దళితులు, గిరిజనులు, మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం సీపీఎం నిలబడుతోంది. నిరుపేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలివ్వాలని సంగారెడ్డి, సదాశివపేట, కొండాపూర్, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ వంటి ప్రాంతాల్లో సీపీఎం సుదీర్ఘ కాలం పోరాటాలు చేసింది. పేదల్ని సమీకరించి పోరాడిన నాయకులపై కేసులు పెట్టి నిర్బంధాన్ని ప్రయోగించినా జడవలేదు. ఆత్మకూర్‌లో పేదల ఇళ్ల స్థలాల సమస్యపై పాదయాత్ర చేసింది. సీపీఎం పోరాటాల ఫలితంగానే గత ప్రభుత్వంలో అనేక మంది పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు దక్కాయి. ఇప్పటికే ఇళ్ల స్థలాలు, ఇళ్ల సమస్యలపై పోరాటాలు సాగిస్తుంది. వెనకబడిన నారాయణఖేడ్ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం అనేక రూపాల్లో పోరాడింది. పారిశ్రామిక ప్రాంతాల్లో కాలుష్య విష భూతం ఆవరించి ప్రజల జీవితాల్ని పాడు చేస్తున్న సమస్యపై కూడా సీపీఎం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిర్లక్ష్యంపై ఉద్యమాలు సాగించింది. మహిళలపై దాడులు, హింసను అరికట్టాలని ఎర్రజెండా పోరాడింది. గిరిజనుకు పోడు భూములకు పట్టాలివ్వాలని, మైనార్టీల అభివృద్ధికి పాటుపడాలని కూడా సీపీఎం ఆందోళనలు చేసింది. తలాపున మంజీరా నది ఉన్నా సాగునీటికి నోచుకోని బీడు భూములకు సాగునీరిచ్చేందుకు ప్రాజెక్టుల్ని నిర్మించాలని సీపీఎం సుదీర్ఘ కాలంగా పోరాడుతూ వస్తోంది.

ముస్తాబైన జహీరాబాద్

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు ఆహ్వాన సంఘం భారీ ఏర్పాట్లు చేసింది. జహీరాబాద్ పట్టణమంతా ఎర్రజెండాలు, తోరణాలతో అలంకరించారు. సీపీఎం మహాసభల కోసం ప్లెక్సీలు, వాల్‌రైటింగ్ ప్రచారం చేశారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు రామచంద్రం, కార్యదర్శి మహిపాల్ , రాజిరెడ్డి, ఇతర నాయకులు భారీ ఏర్పాట్లు చేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాల్ని ఎండగడుతూ సీపీఎం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అనేక రూపాల్లో పోరాటాలు సాగాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాల్ని రద్దు చేయాలని సాగిన పోరాటానికి మద్దతు జిల్లా వ్యాప్తంగా సీపీఎం సంఘీబావ కార్యక్రమాలు చేసింది. కార్మికుల్ని వీధిన పడేసే నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని ట్రేడ్ యూనియన్స్ చేసిన పోరాటాలకు సీపీఎం అండగా నిలిచింది. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసరాల ధరల్ని విపరీతంగా పెంచినప్పుడల్లా సీపీఎం రోడ్లెక్కి పోరాటాలు చేసింది. అంతర్జాతీయ దృక్పథం కల్గిన సీపీఎం అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టింది. బీజేపీ మతోన్మాద పోకడల్ని ఎండగడుతూ మతసామరస్యం కోసం నిలబడింది. రాష్ట్రంలోని ప్రభుత్వాలు అలవిగాని హామీలిచ్చి విస్మరించడంతో సీపీఎం ప్రజల పక్షాన పోరాటాలు చేసింది. అర్హులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, సంక్షేమ పథకాల్ని అర్హులకే మంజూరు చేయాలని విన్నవించింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కూడా సీపీఎం వివిద రూపాల్లో కార్యక్రమాలు చేస్తోంది.


నేడు మహాసభలు ప్రారంభం

సీపీఎం జిల్లా 3వ మహాసభలు శనివారం జహీరాబాద్ పట్టణంలో ప్రారంభం కానున్నాయి. ప్రారంభం సందర్భంగా 11 గంటలకు పట్టణంలోని గంజి నుంచి భారీ ఊరేగింపు ప్రారంభం కానుంది. ఎర్రజెండాలు చేతబూని, ఎర్ర చొక్కాలు ధరించిన వేలాది మంది పార్టీ శ్రేణులు ర్యాలీగా షేట్కర్ పంక్షన్‌హాల్‌కు చేరుకుంటారు. పంక్షన్ హాల్‌లో నిర్వహించే బహిరంగ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్క రాములు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారు. అనంతరం ప్రతినిధులతో కూడిన మహాసభలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా పార్టీ జెండావిష్కరణ చేస్తారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార వేగాన్ని పెంచాలి
జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు


నవతెలంగాణ-సంగారెడ్డి



పట్టణ స్థాయిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార వేగాన్ని పెంచాలని, ప్రభుత్వ భూములను కాపాడాలని ఇరిగేషన్, రెవిన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశించారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, డీఈలు, ఏఈఈలు నీటిపారుదల శాఖ అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులతో ప్రధాన ఎజెండా అంశాలపై శుక్రవారం సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రధానంగా ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ యొక్క పురోగతిని పరిశీలించారు. ఎల్ 1, ఎల్2, ఎల్3 లాగిన్ స్థాయిల్లో ఉన్న దరఖాస్తుల పురోగతి గురించి సంబంధిత అధికారులను సమీక్షించారు. ఇరిగేషన్, రెవి న్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు అందరూ సమన్వయంతో దరఖాస్తుల పరిష్కారాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ఈ అంశంలో అధికారులకు వేగంగా పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే పెండింగ్ పనులను త్వరగా ముగిం చాలని ఆదేశించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) పరిధిలో ఉన్న సరస్సులకు ఫెన్సింగ్ వేయడం, అలాగే డ్రెయిన్ డైవర్షన్ పనులను పర్యవేక్షించడం ,సరస్సుల పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తి చేయాలని, సరైన ఫెన్సింగ్ పనులను చేపట్టి చెరువులను కాపాడాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి మున్సిపల్ కమిషనర్ రోజువారీ తనిఖీలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. శుభ్రతపై ఎలాంటి రాజీ పడకూడదని, పట్టణం పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. పారిశుద్ధ్యంపై ఎటువంటి అలసత్వం నిర్లక్ష్యం చూపిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీపీఓ సాయిబాబా, ఎడి సెర్వే ల్యాండ్ అధికారి ఇగ్నేష్, ఆర్‌డీఓ రాజు, ఇరిగేషన్ అధికారులు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, టీపీఎస్‌లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికి రేషన్‌కార్డులు పంపిణీ చేయాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్




అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లోని సీపీఐ(ఎం) కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేండ్ల నుంచి రాష్ట్రంలో రేషన్‌కార్డుల పంపిణీ జరగలేదన్నారు. కాబట్టి అర్హులైన పేదలందరికి వెంటనే రేషన్ కార్డులు పంపిణి చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఉద్యోగాలు, రేషన్ కార్డులు ఇస్తుందేమో అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఎలాంటి రేషన్ కార్డు అప్లికేషన్ తీసుకోకపోవడం చాలా దుర్మార్గమ న్నారు. ఇప్పటికైనా ప్రజలను మోసం చేయకుండా రేషన్ కార్డు అప్లికేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలన్నారు. అలాగు ఇందిరమ్మ ఇండ్లు, వృద్ధాప్య పెన్షన్స్ ఎందుకు పెంచడం లేదన్నారు. నారాయణ ఖేడ్ నియోజకవర్గ కేంద్రంలో ఇతర అన్ని మండలాలకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వెంటనే వాటికి మరమ్మతులు చేయాలన్నారు. ఏరియా కార్యదర్శి నల్లవల్లి రమేష్, నాయకులు సతీష్ పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా కలెక్టర్ వెల్లడి

నవతెలంగాణ-సంగారెడ్డి



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్‌సీ) ద్వారా నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. నవంబర్ 17, 18 తేదీల్లో జరిగే గ్రూప్-3 పరీక్షలు, డిసెంబర్ 15, 16 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-2, గ్రూప్-3 రాత పరీక్షలను పురస్కరించుకుని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ ఎం.మహేందర్ రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, ప్రాంతీయ సమన్వయకర్తలతో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5.50 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్న దృష్ట్యా ఇప్పటినుండే పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా, ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్-3 పరీక్షలకు 17వేల మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకా నున్నారని, అభ్యర్థులకు మొత్తం 49 పరీక్షా కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటికే అధికారులు ఈ కేంద్రాలను సందర్శించి వసతి సదుపా యాలను పరిశీలించారన్నారు. గ్రూప్-3 పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు, ఇతర మెటీరియల్‌ను కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య భద్రపరిచేందుకు రెండు స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. త్వరగా స్ట్రాంగ్ రూమ్‌లకు సంబంధించిన పూర్తి వివరాలను సమర్పిస్తామని, పరీక్షా కేంద్రాల వివరాలను కూడా ఆన్లైన్ ద్వారా పంపిస్తామన్నారు. ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమిస్తామని, అవసరమైతే ఇతర శాఖల సహకారం తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి అవాంతరాలు తావులేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు. వీడియో కాన్ఫరెన్సులో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ కమిటీలు

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


నవతెలంగాణ-పటాన్‌చెరు



ప్రతి పేదవాడికి సొంతింటి కలను సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిందని.. పూర్తి పారదర్శకంగా కమిటీలు, లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని సంభందిత శాఖ అధికారులకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్ల పథకం విధివిధానాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన నిబంధనలకు అనుగుణంగా గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామ కమిటీలు, వార్డ్ కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని సూచించారు. ఈ పథకం కింద ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సొంతంగా ఖాళీగా జాగా ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు సాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా నిరుపేదలకు జాగా లేకుంటే అధికారుల పరిశీలన తర్వాత వారి ఖాళీ స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో ఎట్టి పరిస్థితుల్లోను అవకతవకలు జరగడానికి వీలు లేదని ఆదేశించారు.త్వరలోనే ప్రభుత్వం లాంఛనంగా పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

సెల్ ఫోన్ లైట్ల వెలుగులోనే దహన సంస్కారాలు

నవ తెలంగాణ-దుబ్బాక



సెల్‌ఫోన్ లైట్ల వెలుగుల్లోనే దహన సంస్కారాలు కానిచ్చిన ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట వార్డులో గురువారం రాత్రి జరిగింది. 11 వ వార్డుకు చెందిన కొడిమ్యాల రాములు గురువారం అనారోగ్యంతో మృతిచెందగా.. అదేరోజు రాత్రి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. ఇదే వార్డులో నూతనంగా నిర్మిస్తున్న స్మశాన వాటిక పనులు నిధులు మంజూరు కాకపోవడంతో అసంపూర్తిగా మిగిలాయి. దీంతో ఎప్పుడూ అంత్యక్రియలు నిర్వహించే కుంటలోనే చితిని పేర్చారు. చుట్టూ చీకట్లోనే అంత్యక్రియలకు హాజరైన బంధువులు, వార్డు ప్రజలు తమ సెల్ ఫోన్ లైట్లను ఆన్ చేయగా.. ఆ వెలుతురులోనే దహన సంస్కారాలు పూర్తి చేశారు. దుబ్బాక మున్సిపాలిటీలో లచ్చపేటను విలీనం చేసినప్పటికీ.. నిధులు మంజూరు చేయకపోవడం పట్ల అంత్యక్రియలకు హాజరైన బంధువులు, వార్డు ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి స్మశాన వాటిక నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

వ్యర్థాల నిర్వహణపై అంతర్జాతీయ సదస్సు

నవతెలంగాణ-పటాన్‌చెరు : 'వ్యర్థాల నిర్వహణ-వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, ఐపీఎల్ఏ అంతర్జాతీయ ఫోరమ్ 2024'పై 14వ అంతర్జాతీయ సదస్సును గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహించనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నిపుణులతో చర్చలు, విజ్ఞాన భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి ఈ యేడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ఈ సదస్సును హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఈ సమావేశంలో వ్యర్థాల నిర్వహణ, వృత్తాకార ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అనేక ఇతివృత్తాలు, వ్యర్థాలు, విధానాలు, నిబంధనలు, ఇంజనీరింగ్, సాంకేతికత, సామాజిక, వ్యాపారం, పరిశ్రమలు, వ్యవస్థాపకత వంటివి ఉంటాయని తెలిపారు. సదస్సులో భాగంగా కీలకోపన్యాసాలు, ప్లీనరీ చర్చలు, ప్రత్యేక సాంకేతిక కార్యక్రమాలు, ప్యానెల్ చర్చలు వంటివెన్నో ఉంటాయన్నారు. విద్యారంగ ప్రతినిధులు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలో పనిచేసేవారు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, నియంత్రణ సంస్థల ప్రతినిధులు, ఆరోగ్య పరిరక్షణ సంస్థలు, ఇతర ఆసక్తి గలవారు ఈ సదస్సులో పాల్గొనవచ్చన్నారు. నిర్దిష్ట ప్రవేశ రుసుము చెల్లించి వ్యక్తిగతంగా లేదా ఆన్‌లైన్‌లో ఈ సదస్సుకు హాజరు కావచ్చని, అలాగే కాన్ఫరెన్స్ ఈ-ప్రొసీడింగ్‌లను కూడా ప్రచురిస్తామన్నారు. ఈ సదస్సుతో పాటు, స్కూల్ కాంగ్రెస్, హ్యాకథాన్, ఇండస్ట్రీ ఎక్స్-పో, ప్రీ-కాన్ఫరెన్స్ డాక్టోరల్ వర్క్-షాపు లను నవంబర్ 27న నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం సదస్సు చైర్మెన్ ప్రొఫెసర్ సాధన్ కె.ఘోష్ 98300 44464, నిర్వాహకుడు డాక్టర్ వైఎల్‌పీ థోరన్లు 8886785076లను సంప్రదించాలని సూచించారు.

చేర్యాల డివిజన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

నవతెలంగాణ-చేర్యాల : చేర్యాలను రెవిన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని జేఏసీ చైర్మన్ ఆర్.పరమేశ్వర్ అన్నారు. చేర్యాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కోసం త్వరలోనే మంత్రులు, ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రాలను అందజేస్తామని తెలిపారు. చేర్యాల ప్రాంత అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమన్నారు.

నవతెలంగాణ
సంగారెడ్డి
2
శనివారం | 19 అక్టోబర్ 2024 | www.navatelangana.com

అనుమానాస్పదంగా మహిళ మృతి..

నవతెలంగాణ-చౌటకూర్



సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం న్యూ ఓన్నాపురం శివారు నాందేడ్ అకోలా 161వ జాతీయ రహదారి పక్కన ఉన్న పొదల్లో అనుమానాస్పదంగా మృతి చెందిన ఓ మహిళ మృతదేహం శుక్రవారం కలకలం రేపింది. మృతదేహన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. అయితే మృతురాలు గంగోజిపేట గ్రామానికి చెందిన మమతగా స్థానికులు గుర్తించారు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. కాగా తన కూతురు చేతిలో బస్తాతో వెళ్లడం అక్కడి స్థానికులు గమనించారని మృతురాలి తల్లి తెలిపింది. అనంతరం ఫోన్ చేసినా.. తన ఫోన్ అందుబాటులోకి రాకపోవడంతో ఆచూకీ లభించలేదని వాపోయింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు పుల్కల్ పోలీస్‌లు తెలిపారు.

కేజీబీవీ పాఠశాలను సందర్శించిన అడిషనల్ ఏపీడీ

నవతెలంగాణ-పుల్కల్



పుల్కల్ మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల, కళాశాలను అడిషనల్ ఏపీడీ బాలరాజ్ శుక్రవారం సందర్శించారు. ముందుగా పాఠశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. మెనూ ప్రకారం నాణ్యమైన కూరగాయలతో మంచి భోజనాలు పెడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం పెడుతున్నారని తెలియడంతో సిబ్బందిని అభినందించారు. విద్యా బోధన ఎలా ఉందో ఆరా తీశారు. అనంతరం పాఠశాల అధ్యాపకులతో కాసేపు ముచ్చటించారు. ఇకనుండి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.



నిమ్జ్ బాధితుల ఖాతాల్లోకి రెండ్రోజుల్లో పరిహారం

నవతెలంగాణ-న్యాల్‌కల్

నిమ్జ్ ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న బాధితులకు రెండ్రోజుల్లో వారి ఖాతాల్లో పరిహారాన్ని జమ చేస్తామని నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ రవీందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని రేజింతల్‌లో 350 మంది నిమ్జ్ రైతుల కాన్సెంట్ అవార్డు పాస్ చేసినట్టు చెప్పారు. రేజింతల్ గ్రామంలో నిమ్జ్ రైతుల పరిహారం చెల్లింపునకు 350 మంది గౌటాన్ పట్టాభూముల రైతులకు రూ.53 కోట్ల డబ్బులు చెల్లించనున్నట్టు చెప్పారు. ఈ మేరకు నిమ్జ్ రైతుల పట్టా పాస్ బుక్, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఒక ఫోటోతో ఒప్పంద పత్రాలను తీసుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఉప తహసీల్దార్ జనార్ధన్, కొత్తూరు బ్యాంక్ మేనేజర్ తుల్జారం, సిబ్బంది గోకుల్, సురేక, పురుషోత్తం, మాజీ ఎంపీటీసీ గ్రామ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, మోషప్ప తదితరులున్నారు.



నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో పాల్గొన్న తన్వీర్

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని న్యామతాబాద్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి కుమార్తె నూతన వస్త్రాలంకరణ వేడుకలో టీఎస్ ఐడీసీ మాజీ చైర్మెన్ మొహమ్మద్ తన్వీర్ పాల్గొని.. చిన్నారులను ఆశీర్వదించారు. నిండు నూరేళ్ల సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆయనతోపాటు నరసింహారెడ్డి నిరంజన్ రెడ్డి, అప్పారావు పాటిల్, మల్ రెడ్డి, అమీర్, గౌసోద్దీన్, సందీప్, సమీ తదితరులు ఉన్నారు.

సింగూర్ గురుకుల పాఠశాలలో గెస్ట్ ఫ్యాకల్టీకి ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

టీజీడబ్ల్యూఆర్ఎస్ సింగూర్ పాఠశాలలో 8, 9,10 తరగతులకు భౌతికశాస్త్రం బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రధానోపాధ్యాయులు జి.ఆగమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు తగిన సర్టిఫికెట్లతో సింగూర్ పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.



పారిశుధ్యం పై నిర్లక్ష్యం తగదు

నవతెలంగాణ-ఝరాసంగం

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి బనిష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాయ్స్ హాస్టల్, అంగన్వాడి కేంద్రాలు, గ్రామంలోని మురికి కాలువలు పరిసర ప్రాంతాలను ఎంపీడీవో సుధాకర్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ బాయ్స్ హాస్టల్, అంగన్వాడి కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించి స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సరస్వతి, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-సదాశివపేట



ఈనెల 19, 20 తేదీల్లో జహీరాబాద్ పట్టణంలో జరుగనున్న సీపీఐ(ఎం) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ సదాశివపేట ఏరియా కార్యదర్శి వి.ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. కార్మిక వర్గ పార్టీగా.. కార్మిక హక్కుల కోసం సీపీఐ(ఎం) నిరంతరం పోరాడుతున్నదన్నారు. రైతు, కూలీ, విద్యార్థి, యువజన సమస్యలపై నికరమైన పోరాటాలు నిర్వహిస్తున్నదని గుర్తు చేశారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై.. ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి నడుస్తున్నదన్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కా రాములు, వీరయ్య హాజరవుతున్నారన్నారు. కాబట్టి ఈ మహాసభలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



విద్యుద్ఘాతంతో మూడు గేదెలు మృత్యువాత

నవతెలంగాణ జిన్నారం

మండలంలోని వావిలాల శివారు ప్రాంతంలో విద్యుత్ ఘాతంతో మూడు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన వీరేశం, లక్ష్మి, కృష్ణలకు చెందిన మూడు పాడి గేదెలు ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతంతో మృతి చెందాయి. బాధిత కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గ్రామసభలు చేయకుండా కమిటీలు వేయడం సరికాదు

నవతెలంగాణ-న్యాల్‌కల్

గ్రామ సభలు ఏర్పాటు చేయకుండా గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలను వేయడం సరికాదని బీజేపీ నాయకులు అన్నారు. గ్రామ సభలు చేసిన తర్వాతనే కమిటీలు వేయాలని ఎంపీడీవో రాజశేఖర్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఓంకార్, మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్, ఉప్పరి మల్లేష్, విష్ణు తదితరులున్నారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా..

కార్మికోద్యమాలు

- కార్మిక హక్కులను కాలరాసే కుట్రలపై అనుబంధ సంఘాలతో కలిసి సీపీఐ(ఎం) పోరాటాలు
- జహీరాబాద్‌లో నేడు, రేపు సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి..
- పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు

నవతెలంగాణ-జహీరాబాద్

ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతమైన సంగారెడ్డిలో సీపీఐ(ఎం) దాని అనుబంధ సంఘాలతో కలిసి ప్రజా, కార్మిక, కర్షక, ఉద్యోగుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తున్నది. ముఖ్యంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఈ జిల్లాలో కార్మికులు లక్షల సంఖ్యలో పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. వేలమంది ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి పరిశ్రమల్లో పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అలాంటి వారికి పరిశ్రమలో ఏ చిన్న సమస్య వచ్చినా సీపీఐ(ఎం) అనుబంధం సంఘం అయిన సీఐటీయూ బాధితులకు అండగా నిలుస్తున్నది. సమస్య పరిష్కారానికి సీపీఐ(ఎం) సైతం పోరాటాలు చేస్తున్నది. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా నిలుస్తూ.. ప్రజా గొంతుకై సీపీఐ(ఎం) నిలబడుతున్నది. దాంతో ప్రజలు కూడా సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా దగ్గరకే వస్తున్నారు. కాగా సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు నేడు, రేపు జహీరాబాద్‌లో అంగరంగా వైభవంగా జరగనున్నాయి. అందుకు నాయకులు కూడా అన్ని ఏర్పాట్లు చేశారు.

సంగారెడ్డి జిల్లాలోని పటాన్చెరు, బొల్లారం, గడ్డపోతారం, పాశమైలారం, బోరపట్ల, సంగారెడ్డి, జహీరాబాద్‌లాంటి పారిశ్రామిక ప్రాంతాల్లో సుమారు 18 వందల కంపెనీలు ఉన్నాయి. ఆయా పరిశ్రమల్లో 2 లక్షల మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ కార్మికులందరికీ ఏ సమస్య వచ్చినా.. సీపీఐ(ఎం), అనుబంధ సంఘం సీఐటీయూనే అండగా నిలుస్తున్నది. కాగా కార్మిక సంక్షేమానికి అండగా ఉన్న చట్టాలను ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు చుట్టాలుగా మార్చుతున్నాయి. పర్మినెంట్ కార్మికులు చేసే పనులు సైతం కాంట్రాక్టు కార్మికులతో చేయిస్తుండడంతో.. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో వివిధ రకాల ప్రమాదాలతో వందకు పైగా కార్మికులు మృతి చెందారని.. 500 మందికి పైగా కార్మికులు గాయపడ్డారని తెలుస్తోంది. అనుభవం, నైపుణ్యతలేని కాంట్రాక్టు కార్మికులతో పర్మినెంట్ కార్మికులు చేసే పనులను చేయించడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని వివిధ సర్వేల ద్వారా వెల్లడైంది. ఇలాంటి కార్మిక వ్యతిరేక విధానాలపై సీపీఐ(ఎం), సీఐటీయూ ఎప్పటికప్పుడు పోరాటాలు చేస్తున్నది. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇప్పించడంతోపాటు.. గాయ పడిన వారికి కూడా మెరుగైన వైద్యం అందించేలా పరిశ్రమ యాజమాన్యాలతో కొట్లాడుతున్నది. అదేవిధంగా పరిశ్రమల్లో మెరుగైన వేతన ఒప్పందం, కనీస సౌకర్యాలు కల్పించేలా యాజమాన్యాలను ఒప్పిస్తున్నది. దాంతో జిల్లాలోని మెజార్టీ పరిశ్రమలో కార్మికులందరూ సీఐటీయూనే ఆదరిస్తున్నారు.

జిల్లాలోని 80 పరిశ్రమల్లో ఎర్రజెండా రెపరెపలు..

జిల్లాలోని సుమారు 80 పరిశ్రమల్లో సీపీఐ(ఎం) అనుబంధ సంఘమైన సీఐటీయూ కార్మిక సంఘమే విజయభేరీ మోగించింది. ఆ పరిశ్రమల్లో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలతో పాటు సౌకర్యాలను కూడా కల్పిస్తున్నది.



మహాసభల ఏర్పాట్లు..



కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్‌లు..

– జి.జయరాజు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

కేంద్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా తీసుకువస్తున్న లేబర్‌కోడ్‌లు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే 12 గంటల పనిని చట్టబద్దత చేశారు. కర్ణాటకలోని ఓ ఐటి పరిశ్రమల్లో 14 గంటలు పని చేయాలని కార్మికులకు నోటీసులు సైతం అందజేశారు. ఇది పూర్తిగా కార్మిక హక్కులను కాలరాయడమే. ఇలాంటి లేబర్‌కోడ్ లకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) సీఐటీయూతో కలిసి ఎన్నో పోరాటాలు చేస్తున్నది.

రాష్ట్రంలోనే అత్యధిక వేతనం ఇప్పించిన ఘనత చుక్క రాములుదే..

జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ తరపున చుక్క రాములు వరుస విజయాలు సాధిస్తున్నారు. జహీరాబాద్ పట్టణం లోని మహేంద్ర అండ్ మహేంద్ర పరిశ్రమ చరిత్రను తిరగరాసి హ్యాట్రిక్ విజయాన్ని చుక్క రాములు కైవసం చేసుకున్నారు. అనంతరం అనేక పరిశ్ర మల్లో మెరుగైన వేతన ఒప్పందాలు ఆయన చేయించారు. కాగా రాష్ట్రంలోనే అత్యధిక వేతనం ఒప్పందం చేయించింది కూడా సీఐటీయూనే కావడం గమనార్హం.

మహాసభను జయప్రదం చేయాలి

– జి.జయరాజు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

నేడు, రేపు జహీరాబాద్‌లోని శెట్కార్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న మహాసభల్లో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి పిలుపునిచ్చారు. మహాసభల ఏర్పాట్లను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యల గురించి ఈ మహాసభలో చర్చించి భవిష్యత్ ప్రణాళికను నిర్మించనున్నట్టు చెప్పారు. గత మూడేండ్ల కాల ంలో నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలను సమీక్షించి భవిష్యతు కార్యాచరణకు రూపకల్పన చేయటం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యా యన్నారు. ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర నాయకులు ఎస్.వీరయ్య చుక్కా రాములు హాజరవుతున్నారన్నారు. ఉదయం పట్టణంలోని సుభాష్ గని నుంచి ప్రదర్శన ప్రారంభమై కుమార్ హోటల్ గుండా శెట్కార్ కళ్యాణ మండపం వరకు ర్యాలీ ప్రదర్శన కొనసాగుతుందన్నారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జహీరాబాద్ ఏరియా కమిటీ కార్యదర్శి రాంచందర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం, నాయకులు మహిపాల్, రాజిరెడ్డి, నరేష్, మసి, రాజు, సూరి తదితరులు పాల్గొన్నారు.



మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఏటీసీ దోహదం

- ఈ నెలాఖరు వరకు ప్రవేశాలకు అవకాశం
- కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి

మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీ) దోహదపడతాయని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఆయా జిల్లాల్లో నెలకొల్పిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశాలకు సంబంధించిన ప్రగతిపై శుక్రవారం ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఏటీసీ కేంద్రాలను అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని, ఈ నెలాఖరు లోపు పూర్తి స్థాయిలో ప్రవేశాలు జరిగేలా చొరవ చూపాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా కార్మిక శాఖ అధికారి రవీందర్ రెడ్డికి ఏటీసీ కేంద్రాల ఏర్పాటు పై దిశానిర్దేశం చేశారు. ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేయాలని, ఏటీసీ కేంద్రాల గురించి అవగాహన పెంపొందించేందుకు వీలుగా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. ఏటీసీ కేంద్రాలలో శిక్షణ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని



సూచించారు. ఒకటి రెండు రోజుల్లోనే తాను క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తానన్నారు. తొలి విడతగా జిల్లాలో సంగారెడ్డి, హత్నూర, ఐటిఐలు గుర్తించి, ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేయబడ్డాయన్నారు. ఏటీసీ కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణాలలోనే ఏటీసీ కేంద్రాలను కొనసాగిస్తూ, ఆయా కోర్సుల్లో శిక్షణను ప్రారంభించడం జరుగుతుందని, త్వరలోనే అన్ని వసతులు, సదుపాయాలతో నూతన భవనాలు అందుబా టులోకి రానున్నాయని వివరించారు. ఏటీసీ కేంద్రాల్లో మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ (ఒక సంవత్సరం కాల వ్యవధి) కోర్సు, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్స్ (ఏడాది), ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్ (ఏడాది), బేసిక్ డిజైనర్ అండ్ వర్చ్యువల్ వెరిఫైర్-మెకానికల్ (రెండేండ్లు), అడ్వాన్స్ సీఎన్‌సీ మిషినింగ్ టెక్నీషియన్ (రెండేండ్లు), మెకానిక్ ఎలెక్ట్రిక్ వెహికల్ (రెండేండ్లు) కోర్సుల్లో శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఈ కోర్సులను పూర్తి చేసుకున్న వారికి వారి సామర్థ్యాన్ని బట్టి వివిధ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, ప్రభుత్వరంగ సంస్థల్లోనూ ఉద్యోగాలు పొందేందుకు ఈ అధునాతన కోర్సులు దోహదపడతాయని కలెక్టర్ సూచించారు. స్వయం ఉపాధిని ఏర్పర్చుకుని పారిశ్రామికవేత్తలుగా స్థిరపడవచ్చన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సులలో చేరేందుకు అర్హులన్నారు. ఎస్సెస్సీ మెమో, టీ.సీ, కుల ధ్రువీకరణ పత్రం, బోనఫైడ్, ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని సూచించారు. ప్రవేశాలకు ఈ నెల 31 చివరి తేదీ అయినందున గడువులోపు అర్హత, ఆసక్తి కలిగిన వారు ఏటీసీ కేంద్రాలలో నిర్దేశిత కోర్సులలో ప్రవేశాలు పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని పని దినాల్లో ఉదయం 9.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సంగారెడ్డి, హత్నూర, ప్రభుత్వ ఐటీఐలో ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. సంబంధిత వివరాల కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ 9848935146, హత్నూర ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ 9963004960ను సంప్రదించవచ్చన్నారు.



పలు కుటుంబాలకు ఉజ్వల్‌రెడ్డి పరామర్శ

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలలోని గణేష్‌పూర్‌లో ఒకటే కుటుంబానికి చెందిన నలుగురు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. మృతుల కుటుంబాన్ని జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉజ్వల్‌రెడ్డి శుక్రవారం గణేష్‌పూర్ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబానికి, పిల్లల చదువులకు అండంగా ఉంటానని భరోసానిచ్చారు. అనంతరం హద్నూర్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న జైపాల్‌రెడ్డిని ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన సందర్భంగా మిర్జాపూర్(బి) గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఉజ్వల్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు కిరణ్ కుమార్ గౌడ్, మధు, ఆసిఫ్, వెంకట్ రెడ్డి, వెంకట్, మోహన్ రెడ్డి,సమీ,సల్మాన్,యునుస్,నరేష్,సందీప్ తదితరులున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



నవతెలంగాణ-మునిపల్లి

గ్రామాలను సందర్శిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్‌హెచ్‌ఓలకు ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం రాత్రి మునిపల్లి పోలీస్‌స్టేషన్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం మునిపల్లి గ్రామాన్ని సందర్శిం చారు. మునిపల్లి పోలీస్‌స్టేషన్‌పరిధిలో ఉన్న రౌడీలు, మోసగాళ్లు మరియు అనుమానితుల ఇండ్ల వద్దకు ఎస్పీ నేరుగా వెళ్ళి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వారి జీవన విధానం, వారు చేస్తున్న పని/ఉద్యోగం గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో చేసిన తప్పులను తిరిగి పునరావృతం చేయకుండా సత్ప్రవర్తన కలిగి సాధారణ జీవన విధానాన్ని కలిగి ఉండాలని సూచించారు. సత్ప్రవర్తన కలిగి ఉన్నట్లయితే నేర చరిత్ర ఫైల్ తీసివేయడం జరుగుతుందన్నారు. యువత చెడు వ్యసనాలను అలవాటు చేసుకోవద్దని, విద్యావంతులు ఇతరులకు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. చదువు పూర్తయిన అనంతరం ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తూ, కలిసి చదువుకొని, ఉద్యోగం సాధించి ఆదర్శంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు సహకరించాలని సూచించారు. గంజాయి, నిషేధిత ఇతర మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా వుండాలని, గ్రామ రక్షణ, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ గ్రామాల సందర్శనలో అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావు, కొండాపూర్ సీఐ చంద్రయ్య, మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ ఉన్నారు.

పాఠశాలల్లో పట్టభద్రుల ఓటు నమోదు

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మండలంలని దామరగిద్ద యూపీఎస్, కారాముంగి జడ్పీహెచ్‌ఎస్, కరస్‌గుత్తి జడ్పీహెచ్‌ఎస్, నాగలిగిద్ద జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో పీఆర్‌టీయూ నాగల్గిద్ద శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ప్రతి ఉపాధ్యాయుడు తమ ఓటును నమోదు చేసుకొని ఉపాధ్యాయ శ్రేయస్సుకు సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని అధ్యక్షులు రమేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాగనాథ్ పిఆర్‌టియు నాయకులు గణేష్, విజయేందర్ రెడ్డి, సూర్యకాంత్, బసవరాజ్, జీవన్, వెంకటలక్ష్మి, జ్యోతి, శ్వేత,ప్రశాంత్‌లు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

ప్రభుత్వ పాఠశాలలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులే చదువుతారని.. కాబట్టి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని ఖేడ్ మండల నోడల్ అధికారి మన్మథ కిషోర్ అన్నారు. ర్యాలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులందరికీ శ్రీకర ఫౌండేషన్ వ్యవస్థాపకులు వినుష , సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ ఆచార్య సహకారంతో రూ.30 వేల విలువగల స్కూల్ బ్యాగులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజాభివృద్ధి విద్యాభివృద్ధితోనే సాధ్యమని అందుకోసం స్వచ్ఛంద సంస్థలు ఖేడ్ ప్రాంతం విద్యాభివృద్ధి కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యా సామాగ్రి అందించడం అభినందనీయమన్నారు. తలిదండ్రుల ఆశయాలను ఉపాధ్యాయుల ఆశీస్సులతో విద్యార్థులు విద్యాభ్యాసంలో ముందుకు సాగాలన్నారు. మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యురాలు నాగ సుజాతరాణి, నిజాంపేట్ మండల విద్యాధికారి రాములు సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ ఆచార్య లైన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకట్రావు, ఉపాధ్యాయులు వినయ్ కుమార్, విజయ్ కుమార్ స్వామి, పర్లాల్, సంతోషమ్మ సక్రూ, సరిత తదితరులు పాల్గొన్నారు.



ఖలీల్‌పూర్‌లో గ్రామ దేవతలకు ప్రాణప్రతిష్ట

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఖలీల్‌పూర్‌లో మూడ్రోజుల గ్రామదేవతలకు ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పురవీధుల నుంచి మహిళలు బోనాలను ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలకు ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహరాజ్ హాజరయ్యారు.



బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి.. ఒకరు మృతి



మరొకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-పటాన్‌చెరు

బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పటాన్‌చెరు పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కుటుంబం కొన్నేళ్ల నుంచి అమీన్పూర్ మండలం బీరంగూడ, సాయి భగవాన్ కాలనీలో నివాసం ఉంటున్నది. శ్రీనివాస్ రెడ్డి కుమారుడు సాయివరుణ్ రెడ్డి (24) విప్రో గచ్చిబౌలిలో సాఫ్ట్వేర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా గురువారం సాయంత్రం స్నేహితుడైన వేణుగోపాల్‌రెడ్డితో కలిసి తన బైక్‌పై మండలంలోని లక్డారం గ్రామంలో మరో స్నేహితుని ఫంక్షన్‌కు సాయివరుణ్ రెడ్డి వెళ్లారు. తిరిగి శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో బీరంగూడకు బైకుపై వస్తుండగా పట్టణంలోని బసవేశ్వర విగ్రహం ఎదురుగా జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొనడంతో బైకు నడుపుతున్న సాయి వరుణ్‌రెడ్డితోపాటు వేణుగోపాల్‌రెడ్డికి తీవ్ర గాయాల య్యాయి. వారిని వెంటనే పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వరుణ్‌రెడ్డి ఇప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మెరుగైన వేణుగోపాల్‌రెడ్డిని దిల్‌సుఖ్‌నగర్‌లోని అనుపమ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్సై కుర్షిద్ అలీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గిరిధర్‌రెడ్డి చొరవతో 13 గ్రామాలకు ఆర్టీసీ సేవలు

నవతెలంగాణ-జహీరాబాద్



రాష్ట్ర సెట్విన్ చైర్మెన్ యన్. గిరిధర్ రెడ్డి చొరవతో 13 గ్రామాలకు బస్సు సౌకర్యం కలిగింది. జహీరాబాద్ నుంచి 13 గ్రామాల మీదుగా మొగడంపల్లి మండలం ఔరంగనగర్ గ్రామం వరకు గిరిధర్ రెడ్డి ప్రత్యేక కృషితో బస్సు వేయించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఆ బస్సుకు భాజాబజంత్రీలతో ఘన స్వాగతం పలికారు.

నవతెలంగాణ
మెదక్
3
శనివారం | 19 అక్టోబర్ 2024 | www.navatelangana.com

సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందజేస్తాం



- ఎమ్మెల్యే రోహిత్ రావ్

నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంతో పాటు నస్కల్ రాంపూర్ గ్రామాలలో సొసైటీ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 473 కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320 లు, ఎన్నికలలో ఇచ్చిన హామీని రైతులకు రూ. 500 బోనస్ అందజేస్తామని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం విక్రయించాలన్నారు. అనంతరం రాంపూర్ గ్రామంలో గౌడ కులస్తులకు కాటమయ్య రక్ష కవచాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలం ఎంపీపీ దేశెట్టిసిద్ధరాములు, వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి, రామాయంపేట ఎక్సైజ్ సీఐ రాణి, ఎస్సై విజయ్ సిద్దార్థ, ఏఈఓ శ్రీలత, సొసైటీ చైర్మెన్‌లు బాపురెడ్డి, బాజా చంద్రం, సీఈఓ నరసింహులు, శోభారాణి, మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి, మండల అధ్యక్షులు మారుతి, నసీరుద్దీన్, వెంకటేష్ గౌడ్, సుప్రభాత రావు, లక్ష్మణ్ గౌడ్, రామచంద్ర గౌడ్, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ఉపాధ్యాయులకు డీఎలు మంజూరు చేయాలి

నవతెలంగాణ-పాపన్నపేట





రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే డీఎలు మంజూరు చేయాలని పీఆర్‌టీయూ మండల శాఖ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పంతులు రాజు, సురేష్, రాష్ట్ర నాయకులు వెంకటరామిరెడ్డి, లింగప్పలు పాపన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐదు డీఏలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఇందులో కనీసం మూడు డీఏలన్నా మంజూరు చేస్తూ త్వరలో జరగబోయే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆర్వో ప్లాంట్ ఏర్పాటు



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్ట్రీట్ కాస్ వాటర్ ప్రాజెక్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ని మండల విద్యాధికారి డి.వెంకటేశం ప్రారంభించారు. ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నీటి వసతి కలిగించేలా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు సంస్థ వాలంటీర్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కంది రాజేశ్వర్, ఉపాధ్యాయులు సుధీర్, సత్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయురాలి విరాళం



నవతెలంగాణ-చేగుంట

పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయురాలు ముందుకు వచ్చి లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాల వడియారంలో "మన ఊరు మన బడి" పథకంలో భాగంగా నిలిచిపోయిన పనులను పూర్తి చేయుటకు పాఠశాల ఉపాధ్యాయురాలు వసంత టీచర్ వారి పిల్లల సహకారంతో ఒక లక్ష రూపాయలను ప్రకటించడమే కాకుండా రూ.25 వేలు తక్షణ సహాయంగా చెక్కును పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధరాములకు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న వసంత, టీచర్‌ను ప్రధానోపాధ్యాయులు, సిద్దిరాములు, ఉపాధ్యాయ సిబ్బంది, ప్రియదర్శిని, సంతోషిమాత, అమరేశ్వరి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

- కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల పరిధి మానేపల్లి గ్రామంలో గత కొన్ని ఏళ్ల నుంచి ఉపాధ్యాయుల కొరత ఉండడంతో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి పెద్ద మనసుతో తన సొంత డబ్బులతో విద్యా వాలంటరీ నియమించి విద్యార్థులకు విద్యను అందించే తరుణంలో ప్రభుత్వం నూతనంగా ఉపాధ్యాయుల నియామకంలో భాగంగా మానేపల్లి గ్రామానికి గ్రామానికి హిందీ పండిత్, గణితం, జీవ, సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన ఉపాధ్యాయులు నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం వారిని స్వాగతిస్తూ శాలువులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మాజీ ఎస్ఎంసి చైర్మన్ దాసరి శ్రీను, దినేష్, నాయకులు పోతిరెడ్డి, శ్రీనివాస్, రమేష్, మల్లేష్, సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మనస్థాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-వెల్దుర్తి

గత కొంతకాలంగా ఇంట్లో జరుగుతున్న గొడవలకు మనస్థాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండల పరిధి ఎలుక పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎలుక పల్లి గ్రామానికి చెందిన, కె.శంకర్ (22) ఇంట్లో పిన్న తల్లి దుర్గమ్మతో సంసార విషయంలో రోజు గొడవలు జరుగుతుండేవి. గురువారం సాయంత్రం ఇంట్లో గొడవలు చెలరేగడంతో మనస్థాపానికి గురై 11 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుని చెల్లె సాయముల శైలజ ఫిర్యాదు మేరకు శవ పంచనామ నిర్వహించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.


ప్రేమ వివాహం చేసుకున్న యువకుని ఇంటిపై దాడి

నవ తెలంగాణ-రాయపోల్



యువతీ యువకుడు ప్రేమించుకుని ప్రేమ వివాహం చేసుకున్న యువకుడి ఇంటిపై యువతి కుటుంబ సభ్యులు దాడి చేసిన సంఘటన రాయపోల్ మండలం టెంకంపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం టెంకంపేట గ్రామానికి చెందిన కోరే మల్లేష్ కుమారుడు కోరే నవీన్, నీల స్వామి పెద్ద కూతురు నీల మాధురి గత కొన్ని రోజులుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి యాదగిరిగుట్టలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ విషయం నీల స్వామి కుటుంబ సభ్యులకు తెలిసింది. ఈ విషయంలో కోపోద్రిక్తులై శుక్రవారం తెల్లవారుజామున మైసని రాజు, మైసని ఆంజనేయులు, మైసని మహేష్, మైసని కిష్టయ్య, మైసని స్వరూప, మైసని చిన్న స్వరూప, మైసని రేణుక వీరు అందరు కలిసి కోరే మల్లేశం ఇంటి మీద కట్టెలు, రాళ్లతో దాడి చేశారు. ఇంటిపై ఉన్న సిమెంట్ రేకులు, కూనపెంకలను ధ్వంసం చేశారు. మీ కుమారుడిని ఎక్కడ పంపించారో చెప్పాలంటూ ఇంట్లో ఉన్న మల్లేశంపై కూడా దాడి చేశారు. మల్లేశం కుమారుడు నవీన్ ప్రేమ వివాహం చేసుకున్నారన్న కోపంతో ఇంటిపైన, తనపైన దాడి చేసి రూ. 10 వేల వరకు ఆస్తినష్టం చేశారని బాధితుడు కోరే మల్లేశం తెలిపారు. నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరే మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్:

మానసిక పరిస్థితి సరిగ్గా లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని ఇర్కోడ్ దర్గా వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేటకు చెందిన ఎండీ. షాబోద్దీన్ గత 10 సంవత్సరాల నుంచి మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో గత 5 సంవత్సరాల నుంచి రూరల్ మండలపరిధిలోని ఇర్కోడ్ ధర్గా వద్ద రూములో ఉంటున్నాడు. ఇదిలాఉండగా గత సోమవారం ఉదయం కుటుంబికులు వెళ్లి చూడగా షాబోద్దీన్ కనబడలేదు. దీంతో బంధువులు, స్నేహితులు, చుట్టుప్రక్కల గ్రామాల్లో వెతికినప్పటికి ఎలాంటి ఆచూకి తెలియరాలేదు. ఈ మేరకు అదృశ్యమైన షాబోద్దీన్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రోహిత్ రావు



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధి గ్రామమైన శేరిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు, ఐకేపీ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం రోహిత్ రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులు ధర్నాలు చేసేంత వరకు వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు కారన్నారు. తమది ప్రజా ప్రభుత్వం, రైతుల సంక్షేమం కోరే ప్రభుత్వం కాబట్టి వరి కోతలు కాక ముందే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతుల కోసం 473 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేయడం జరిగిందని, రైతులు దళారులను నమ్మకుండా తాము ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తరలించి, పంటకు గిట్టుబాటు ధర పొందాలని కోరారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2320 లు, బీ గ్రేడ్ రకానికి రూ.2300 లు, సన్న వడ్లను ఐదు వందల బోనస్ కూడా రైతులకు అందిస్తారని తెలిపారు. తదనంతరం శేరిపల్లి నివాసి శ్రీరామ్ కృష్ణకు సీఎం సహాయ నిధి నుంచి రూ.60 వేలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ కరీం, ఎంపిడిఓ ఆనంద్, ఐకేపీ ఏపీఎం అశోక్, ఐకేపీ సీసీ శంకర్, సుల్తానా, వీఓఏ రామచంద్రం, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తాళ్ళ స్వప్న, మెదక్ జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, శేరిపల్లి మాజీ సర్పంచ్ తాళ్ళ కృష్ణా గౌడ్, శంకరం పేట్ మాజీ సర్పంచ్ రాజీ రెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, గ్రామ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు బాచి స్వామి, మండల నాయకులు అంచనూరి రాజేష్, లక్ష్మి నరసింహులు, చందూ యాదవ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి

- ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ
- మెదక్ జిల్లాలో త్వరలోనే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షిల్ పాఠశాలలు
- పోచారం, మెదక్ ఖిల్లా, ఏడుపాయలను టూరిజంగా ఏర్పాటు
- వంద ఫీట్ల ఎత్తుతో అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తా
- మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని, ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేశామని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కూచన్ పల్లి, హవేలీ ఘనాపూర్, గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఖచ్చితంగా నెరవేర్చుతానని, ఉమ్మడి మెదక్ జిల్లాలోనే అభివృద్ధిలో మెదక్ జిల్లాను అగ్రభాగాన ఉండేలా ప్రణాళికను సిద్ధం చేశానని స్పష్టం చేశారు. మెదక్ నియోజక వర్గంలోని మెదక్ ఖిల్లా, చర్చి, పోచారం అభయారణ్యం, ఏడుపాయలను ప్రత్యేక నిధులతో ప్రత్యేకత చాటుకునేలా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రపంచఖ్యాతి గాంచిన మెదక్ కెతెడ్రల్ చర్చి దేశానికే తలమానికం అని, నియోజక వర్గానికి హైలెట్ గా నిలిచిందని దాదావు యాభై నుంచి వంద ఫీట్ల ఎత్తున్న ఏసు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు ఆయన తెలిపారు. మెదక్ పట్టణంలో మిగతా విగ్రహాల కన్న అంబేద్కర్ విగ్రహం చిన్నగా ఉందని అలా కాకుండా జిల్లాలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాని ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. పేరుకే మెదక్ పదేండ్లలో స్పష్టమైన అభివృద్ధి చేయలేదని ఆయన విమర్శించారు. మెదక్ నుంచి తరలిపోయిన అన్ని కార్యాలయాలను ఎన్నికల్లో హామిలో భాగంగా మెదక్‌కు రప్పిస్తానన్నారు. అందులో భాగంగా యుద్ధప్రాతిపదికన కన్సర్ వేటర్ ఆఫ్ ఫారెస్ట్, అసిస్టెంట్ డైరెక్టర్, డ్రగ్స్ అండ్ కెమిస్ట్రి ఏర్పాటు విషయంలో ముఖ్యమంత్రి తో పాటు మంత్రుల దృష్టికి తీసుకెళ్లానని, ఆయా మంత్రులకు కూడా లేఖలు పంపించానని అవి త్వరలోనే తెలుపుతానని ఆయన అన్నారు. తరలిన జింకలను కూడా తీసుకువస్తానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తరలి పోయిన పి.జి. కళాశాలను ఏర్పాటు చేస్తానని ఆయన హామినిచ్చారు. వైద్య విషయంలో మెదక్‌కు మెడికల్ కళాశాలను రప్పించడంలో క్రియాశీల పాత్ర పోషించానని, జిల్లా ఔషద గిడ్డంగి కేంద్రం ను కూడా మెదక్ కు తీసుకువచ్చానని, గతంలో సంగారెడ్డికి వెళ్ళి మందులు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కూచన్ పల్లి విద్యార్థులు, తల్లిదండ్రుల కోరిక మేరకు ఎస్.ఎస్.సి. సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని గ్రామస్థులకు హామినిచ్చారు. వడ్ల కొనుగోలు విషయంలో పూర్తిగా పంట చేతికి రాకముందే ప్రతి గింజను కొనుగోలు చేయాలనే ఉద్దేశ్యంతో ముందుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. మెదక్ జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకురానున్నట్లు మెదక్ నియోజక వర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళానని, లేఖను కూడా అందజేశానన్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు కానున్నట్లు ఆయన పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పరశురాం గౌడ్, హఫీజ్ ఉద్దీన్, బాలకిషన్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మహేందర్ రెడ్డి, అక్బర్, శ్రీకాంత్ చిట్యాల శ్రీనివాస్, పోశెట్టి, రాము, ఆదిల్ పాషా రిజ్వాన్, ఆయా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల వెనుకబాటుకు మూఢనమ్మకాలే కారణం

- మూఢనమ్మకాలు విద్యార్థులు వీడాలి
- విద్యార్థి చేతిపై మంటలు లేపుతున్న నరేష్
- సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్



నవతెలంగాణ-చేగుంట

మహిళల వెనుకబాటుకు మూఢనమ్మకాలే కారణమని విద్యార్థులు విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడాలని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు చేగుంట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రెడ్డిపల్లి కాలనీలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, కస్తూర్బా బాలికల విద్యాలయం నందు మహిళల రక్షణ- మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉప్పులేటి నరేష్ హాజరై మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని, దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉప్పులేటి నరేష్ మాంత్రికులు భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుమతి, శ్రీవాణి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ షరీఫ్, వైస్ ప్రిన్సిపల్ మేరీ, పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రమైన అక్కన్నపేట స్టేషన్

- నవతెలంగాణ ఎఫెక్ట్





నవతెలంగాణ-రామాయంపేట

ఎట్టకేలకు అక్కన్నపేట రైల్వే స్టేషన్ కాస్తంత శుభ్రంగా, చెత్త లేకుండా తయారైంది. "చెత్తాచెదారంతో అక్కన్నపేట రైల్వే స్టేషన్" అనే శీర్షికన 'నవతెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. శుక్రవారం రైల్వే అధికారులు ప్రత్యేక సిబ్బందితో రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాలను ఊడ్చేశారు. ఫిర్యాదులు వచ్చినప్పుడే కాకుండా ప్రతిరోజు రైల్వే స్టేషన్ శుభ్రంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలాగే తాగునీటి సమస్యను పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి. ప్రయాణికుల కోసం మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వీధి కుక్కల స్వైర విహారం..

- చిన్నారిపై దాడి..తీవ్ర గాయాలు
- మెరుగైన చికిత్సకు సిద్దిపేటకు తరలింపు





నవతెలంగాణ-బెజ్జంకి

వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయాలైన సంఘటన మండల పరిధిలోని చీలాపూర్ పల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గజ్జెల రిషిక (5) పాఠశాల నుంచి స్వగృహానికి వెళుతున్న క్రమంలో వీధిలో కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. కుక్కల దాడిని గమనించిన పంచాయితీ పారిశుధ్య కార్మికుడు గజ్జెల సంతోష్ చిన్నారిని రక్షించే యత్నం చేయగా కుక్కలు అయనపై దాడి చేశాయి. గాయపడిన చిన్నారిని మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుండారంలో...

మండల పరిధిలోని గుండారం గ్రామంలో వీధి కుక్కలు స్థానికుడు మిర్యాల రమేశ్ (36)పై దాడి చేసి గాయపర్చాయి. తీవ్ర గాయాలవ్వడంతో రమేశ్‌ను స్థానికులు సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

25న మాల మహానాడు నాయకుల సమావేశం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకుల సమావేశం ఈ నెల 25వ తేదిన మండల మాల మహానాడు అధ్యక్షుడు బండారి చంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. జాతీయ మాల మహానా డు రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు నిర్వహించే ఈ సమావేశానికి రాష్ట్ర జిల్లా ముఖ్య నాయకులు హాజరవుతు న్నారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ ఈనెల 25న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించడం జరుగుతుందన్నారు. వచ్చే నెల 23న నిజాంపేట మండల కేంద్రంలోకి పాదయాత్ర చేరుకుంటుందని అందుకు తగిన ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవడానికి చర్చించడానికి రాష్ట్ర నాయకులు రావడం జరుగుతుందన్నారు. ఏబీసీడీ వద్దు కలిసి ఉంటే ముద్దు అనే నినాదంతో ముందుకు వెళ్లాలని మాల సోదరులందరూ అధిక సంఖ్యలో పాల్గొని పాద యాత్రను జయప్రదం చేయాలని కోరుతున్నామ న్నారు. ఈ కార్యక్ర మానికి విచ్చేస్తున్న జాతీయ మాల మహానాడు రాష్ట్ర పోలీస్ చైర్మెన్ ర్యాకం శ్రీరాములు, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్య క్షులు సామల అశోక్, తెలం గాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కనిగిరి రవికుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆకుల పెంటయ్య తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోరట్ల శివ, మెదక్ జిల్లా అధ్యక్షులు కల్లూరి సంజీవ, జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాషి సంజీవ్, రామాయంపేట మండల అధ్యక్షులు బైరం సిద్దన్న, తదితరులు హాజరవుతున్నారన్నారు.

కరువు భత్యం విడుదల చేయాలి

- టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్

నవతెలంగాణ-మెదక్

ఉద్యోగులకు న్యాయంగా రావలసిన ఐదు విడతల కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవో భవన్లో ఏర్పాటుచేసిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల మేని ఫెస్టోలో తెలిపిన విధంగా దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగుల అన్ని రకాల బిల్లులు వెంటనే చెల్లించాలని, గత ప్రభుత్వంలోని మూడు విడతలు, నూతన ప్రభుత్వ రెండు విడతల కరువు భత్యాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం చిత్తశుద్ధితో నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. వీటితోపాటు ఉద్యోగుల నెలసరి భాగస్వామ్యంతో నగదు రహిత ఆరోగ్య కార్డులు ఇవ్వాలని, మెడికల్ సిబ్బంది ఎం పి ఎచ్ ఏ లకు అదనపు ఇంటి అద్దె అలవెన్స్ పునరు ద్ధరించాలన్నారు. డిజిటల్ క్రాఫ్ట్ సర్వే నిమిత్తం వ్యవసాయ విస్తరణ అధికారులకు సహాయకులను నియమించాలని, పంచాయతీ కార్యదర్శులు పల్లె ప్రగతికి వెచ్చించిన పెండిం గ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, టీఎస్‌జీఎల్ఐ కార్యాల యాన్ని సంగారెడ్డి నుంచి మెదక్ పట్టణానికి తరలించాలని తదితర తీర్మానాలు జిల్లా కార్యదర్శి మినికి రాజ్ కుమార్ ప్రవేశపెట్టి ఆమోదింపజేశారు. అదేవిధంగా ఈనెల 22 న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్ వద్ద భోజన విరామ సమయ ధర్నా చేయాలని సమావేశంలో నిర్ణయిం చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురా లు గాండ్ల అనురాధ, జిల్లా సహా అధ్యక్షులు ఎండి ఇక్బాల్ పాష, కోశాధికారి ఎం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కే ఫణి రాజ్, ఎండి ఫజలుద్దీన్, కోటి రఘునాథరావు, లీల, సంయుక్త కార్యదర్శులు పోతురాజు శంకర్, పంపరి శివాజీ, కిరణ్ కుమార్, రాధా, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ప్రచార కార్యదర్శి నర్సింలు, క్రీడల కార్యదర్శి గోపాల్, కార్యవర్గ సభ్యురాలు దోమ మరియ, రామాయంపేట, చేగుంట, అల్లాదుర్గ్, నర్సాపూర్ మరియు ఏడుపాయల వనదుర్గ యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు అనుముల ప్రభాకర్, అశోక్ రెడ్డి, ధర్మాచందర్, రాకేష్, ప్రశాంత్, విజ య్, జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడు జం గం నగేష్ కుమార్, పశుసంవర్ధక శాఖ ఫోరం జిల్లా కార్యదర్శి లింగమూర్తి, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి శేఖర్, నీటిపారుదల శాఖ ఫోరం జిల్లా కార్యదర్శి శ్రీహర్ష, వైద్య ఆరోగ్యశాఖ ఫోరం జిల్లా కార్యదర్శి మంజుల, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేలో ముస్లిం మైనార్టీలను చేర్చాలి



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుల గణనలలో భాగంగా ఇంటింటి సర్వేలో చేపడుతున్న సామాజిక ఆర్థిక, విద్య ఉద్యోగ రాజకీయ కుల సర్వేలో ముస్లిం మైనార్టీ వర్గాలకు కూడా చేర్చాలని తురక కాశ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు షరీఫ్ కోరారు. ఎస్సీ, ఎస్టీలకన్నా ముస్లిం మైనార్టీల స్థితిగతులు చాలా అధ్వాన్నంగా ఉన్నాయన్నాయని పలు సర్వేలలో పేర్కొనడం జరిగిందన్నారు. ఈ సర్వేలన్నీ కేంద్ర ప్రభుత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసినవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయినందున ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఇంటింటి సర్వే చేయిస్తున్నందున, అదే మాదిరిగా ముస్లిం మైనార్టీలను తురక కాశ వారిని ఇంటింటి సర్వే కూడా చేయించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఆ విధంగా చేసినట్లయితే ముస్లిం మైనార్టీ వర్గాల్లో వెనుకబడిన జాతులలో ఒకటైన బండ కొట్టే తురక కాశ కార్మికులు తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 7 లక్షల కుటుంబాలు దుర్భర జీవితాలను గడుపుతున్నార న్నారు. వారు సామాజిక ఆర్థిక విద్య జీవన పరిస్థితుల సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందించాలన్నారు. ఈ నివేదిక ఆధారంగా వారి సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 10వ తేదీన జారీ అయిన ఇంటింటి సర్వే జీవో నెంబర్ 18ను సవరించి ఆ సర్వేలో ముస్లిం మైనార్టీ వర్గాలను, అందులో తురక కాశ కార్మికులను కూడా జత చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

పెద్దమ్మ ఆలయంలో విగ్రహాలు చోరీ







నవ తెలంగాణ-రాయపోల్

పెద్దమ్మ ఆలయంలోని గర్భ గుడి తాళాలు పగలగొట్టి పెద్దమ్మ, పెద్ది రాజు రాతి విగ్ర హాలతో పాటు ఆమ్లిఫైర్ మైక్ సెట్‌ను చోరీ చేసిన సంఘటన రాయపోల్ ఆరేపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం ఆరేపల్లి గ్రామంలో ముంగిస్ పల్లి రోడ్డు మార్గంలో పెద్దమ్మ ఆలయాన్ని నాలుగు సంవత్సరాల క్రితం నిర్మించుకున్నారు. ఆ ఆలయం సేవకులుగా అదే గ్రామానికి చెందిన కాశమైన అండమ్మ యాదయ్య దంపతులను నియమించారు. గురువారం సాయంత్రం ఆలయంలో పనులు ముగించుకొని ఆలయానికి భద్రంగా తాళం వేసి ఇంటికి వచ్చారు. ప్రతిరోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం 5:00 గంటల సమయంలో ఆలయాన్ని శుభ్రం చేయడానికి అండమ్మ వెళ్ళింది. ఆలయం బయట శుభ్రం చేసి లోపల శుభ్రం చేసి భక్తి పాటలు పెట్టడానికి మైక్ సెట్ పెడదామని లోపలికి వెళ్లి చూడగా గర్భగుడి తాళాలు పగలగొట్టి పెద్దమ్మ పెద్దిరాజు రాతి విగ్రహాలతో పాటు, ఆమ్లిఫైర్ మైక్ సెట్ దొంగలించారు. సుమారు వాటి విలువ రూ .31 వేలు ఉంటుంది. వెంటనే సమాచారం గ్రామస్తులకు ముదిరాజ్ ఫోన్ ద్వారా సమాచారం అందించగా అందరూ వెళ్లి చూసేసరికి ఆలయంలో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులనుత్వరితగతిన పూర్తి చేయాలి

- మునిసిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఆన్లైన్‌లో త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2020 (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తులు పూర్తి చేయుటకుగాను మొదటగా 4 లాగిన్‌లు తీసుకోవటం జరిగిందని, కాని ఈ 4 లాగిన్‌ల ద్వారా ఆన్లైన్ చేయుటకు ఎక్కువ సమయం పట్టడం, ఆలస్యం అవుతున్న నేపథ్యంలో త్వరితగతిన పూర్తి చేయుటకు మరో 29 లాగిన్‌లను ప్రత్యేకంగా క్రియేట్ చేపించటం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం మొత్తం 33 లాగిన్‌లను ఆన్లైన్ కొరకు క్రియేట్ చేయటం జరిగిందన్నారు. మొత్తం 32533 పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఒక్కొక్కరికి 1000 దరఖాస్తులను పూర్తి చేయుటకు అదేశించటం జరిగిందన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ అధికారులు వందనం, నస్రీన్ భాను, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ-జగదేవపూర్

దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్ రెడ్డి తెలిపారు. గత 2 వారాల క్రితం మునిగడప గ్రామంలో తలారి సురేష్, తన కుటుంబ సభ్యులతో కలసి వారి బంధువు అంత్యక్రియలకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తి రాత్రి సమయంలో సురేష్ ఇంటిలోకి ప్రవేశించి ఇంటిలోని నగదు రూ.25 వేలు, అర తులం బంగారు ఉంగరంను దొంగిలించాడు. విచారణ జరపగా తుమ్మ నవీన్ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్ర మోహన్ ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జగదేవపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బందిని సిఐ మహేందర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఘనంగా కట్ట మైసమ్మ విగ్రహా ప్రతిష్ట



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైన మర్కుక్ పాములపర్తి గ్రామాల మధ్య గల చెరువు కట్టమీద ఉన్న శ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహం పున ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు అప్పాల మాధవశర్మ బృందం కార్తీక్ శర్మ, శశిపంతులు ఆధ్వర్యంలో విగ్రహ పునప్రతిష్టను కావించారు. అనంతరం బీజేపీ మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్, సీనియర్ నాయకులు సాయిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షులు మ్యాకల కనకయ్య, శంకర్ రెడ్డి, సాయిని మహేష్, బబ్బూరి సతీష్ గౌడ్, నిర్వహకులు ఊషికేల ఎల్లం, వెంకటేష్, హరిశంకర్, సుర్వీ బాలనర్సయ్య, రమేష్ గుప్తా, బాపురెడ్డి, ఆకుల అనిల్, తదితరులున్నారు.

రూ.10 కాయిన్స్ చెల్లుబాటులో ఉన్నాయి

- ఎల్‌డీఎం హరిబాబు



నవతెలంగాణ-సిద్దిపేట

పది రూపాయల కాయిన్స్ చెల్లుబాటులో ఉన్నాయని, చెల్లుబాటులో లేవని ప్రజల్లో అపోహ ఉందని ఎల్‌డీఎం హరిబాబు అన్నారు. లీడ్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో రూ.10ల కాయిన్స్ మేళ స్థానిక రైతు బజార్‌లో నిర్వహించారు. యూనియన్ బ్యాంక్, ఎస్బిఐ బ్యాంక్ ఆధ్వర్యంలో రైతు బజర్ వద్ద, దుద్దెడ టోల్ ప్లాజా వద్ద రూ.10ల కాయిన్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రూపాయల కాయిన్స్‌తో లావాదేవీలు జరపవచ్చని ప్రజలకు, వ్యాపారస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యూబీఐ చీఫ్ మేనేజర్ సురేష్, ఎస్బిఐ రవి, టోల్ ప్లాజా మేనేజర్ అశోక్ రెడ్డి, రైతు బజార్ ఈవో ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ కర్మాగారంలో రైతులకు అవగాహన సదస్సు



నవతెలంగాణ-నంగునూరు

మండలం నర్మెట ఆయిల్ కర్మాగారంలో శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అధ్యక్షతన పామ్ ఆయిల్ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పామ్ ఆయిల్ రైతులకు పామ్ ఆయిల్ సాగుపై ఐటీపీఆర్ శాస్త్ర వేత్తలు, ఇతర శాస్త్రవేతలచే నిర్వహించబడునని పేర్కొన్నారు. రైతు సోదరులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మండల విద్యాధికారికి సన్మానం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల విద్యాధికారి గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రచ్చ కిష్టయ్యను శుక్రవారం మండల కేంద్రంలో చేర్యాల రచయితల సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో రచయితల సంఘం అధ్యక్షులు మంగళగిరి రామ చంద్రమూర్తి, కార్యదర్శి ఎలికట్టె అయిలయ్యలు ఉన్నారు.

మండలి వైస్ చైర్మన్‌ను కలిసిన కొట్టాల



నవతెలంగాణ-గజ్వేల్

శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండ ప్రకాష్ జన్మదిన సందర్భంగా శుక్రవారం నాచారం ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మెన్ కొట్టాల యాదగిరి పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని ఉన్నంత పదవులను పొందాలని ఆకాంక్షించారు. ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బలోపేతం చేసేందుకు మరింత కృషి చేయాలని ఆయన దృష్టికి తీసుకుపోయినట్లు యాదగిరి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక సబ్ డివిజన్ పరిధిలోని హబ్సిపూర్ సబ్ స్టేషన్ (132/33 కేవీ)లో బ్రేకర్ మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏడీఈ సీహెచ్.గంగాధర్ పేర్కొన్నారు. 19వ తేది ఉదయం 11.00 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షునిగా శ్రీనివాస్

- నియామక పత్రం అందించిన బైతి తిరుపతి



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షునిగా పోతుల శ్రీనివాసు ను నియమించారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్ రెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బైతి తిరుపతి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోతుల శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యకులుగా ఎన్నుకున్నందుకు ఎంపీ మాధవనేని రఘునందన్ రావు, బీజేపీ జిల్లా అగ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ నాయకులకు, కిసాన్ మోర్చా నాయకులకు, కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

కట్టమైసమ్మను దర్శించుకున్న తిర్మల్ రెడ్డి



నవతెలంగాణ-మర్కుక్

మండల కేంద్రమైనలోని మర్కుక్ పాములపర్తి గ్రామాల మధ్య గల చెరువు కట్టమీద ఉన్న శ్రీ కట్టమైసమ్మ దేవాలయాన్ని శుక్రవారం పాములపర్తి మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ.26 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మర్కుక్ మండలాధ్యక్షులు కనకయ్య గౌడ్, సీనియర్ నాయకులు బబ్బూరి మల్లేష్ గౌడ్, సాయిరెడ్డి చెంద్రశేఖర్ రెడ్డి, మొర్సు శ్రీనివాస్ రెడ్డి, ర్యాకం స్వామి, నవీన్, శివకుమార్, గౌడ్, హరి శంకర్, సాయిరెడ్డి, మహేష్ రెడ్డి, ఉషేకేలా ఎల్లం,సంజీవరెడ్డి, నాని,తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన దాడి రవికి రూ.15.500ల సీఎం ఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ జెడ్పీటీసీ రామచంద్రం యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డిలు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడ్డం ప్రసాద్, నాయకులు కృష్ణ, గోలి నరేందర్, బాలరాజు, కర్ణాకర్, భీంసింగ్, నరేష్, తదితరులున్నారు.

సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తేనే పరిష్కారం

- ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకై ఐక్యంగా పోరాడాలి
- సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



నవతెలంగాణ-చేర్యాల

సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తేనే పరిష్కారం అవుతాయని సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి తెలిపారు.చేర్యాల మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో శుక్రవారం ఆ గ్రామ సీపీఐ(ఎం)మహాసభ బొడిగం నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్య అతిధిగా మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. చుంచనకోట గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో పరిష్కారం కానీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, అంతర్గత రోడ్లు, చుంచనకోట నుంచి వీరన్నపేట వరకు బీటీ రోడ్డు నిర్మాణం, ప్రజల మౌలిక సదుపాయాలు లాంటి అనేక సమస్యలు ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి ఏళ్ల తరబడి ప్రజలు ఎదురుచూస్తున్నారని గ్రామంలో పార్టీ బలపడి పోరాటాలు నిర్వహించిన నాడే ప్రజా సమస్యలు పరిష్కరించబడతాయన్నారు. సీపీఐ(ఎం) నిర్వహించే పోరాటాల్లో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి గతంలో తమ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. రాష్ట్రంలో నేడు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఎన్నికలలో అనేక హామీలు ఇచ్చి తాత్సారం చేస్తుందని, ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలను ఏకం చేసి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ(ఎం) చరిత్ర అంతా పోరాటాల చరిత్రేనని, ప్రభుత్వాలు మారినా సమస్యలను పరిష్కరించకుండా ప్రజల దృష్టిని సమస్యలవైపు కేంద్రీకరించకుండా మళ్ళిస్తున్నారని, దీనిని గమనించి పార్టీ నిర్వహించే పోరాటాల్లో పాల్గొని మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా పండుగ యాదగిరి, పార్టీ సోషల్ మీడియా ఇంచార్జిగా కర్రె బాలరాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, బోయిని మల్లేశం, మండల కమిటీ సభ్యులు గొర్రె శ్రీనివాస్, ఎండి కరీం, రేపాక కుమార్, మల్కని ఎల్లయ్య, ముస్త్యాల ప్రభాకర్, గుంద్ర రవీందర్,పొన్నమైన లింగయ్య, కర్రోళ్ల మల్లయ్య, భీమరాజు, మంద శోభ, పండుగ బాలమణి, గొర్రె మంజుల, పండుగ సుజాత, భత్యపు కలవ్వ తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డు పైలెట్ ప్రాజెక్టుగా గుర్తింపు



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు నమోదు కార్యక్రమాన్ని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నది. మున్సిపల్‌లో మొత్తం 20 వార్డులు ఉండగా 60 వేల జనాభా పైగా నివసిస్తున్నారు. 35 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఇందులో పైలెట్ ప్రాజెక్టుగా 17వ వార్డును ఎంపిక చేశారు. ఇటీవల సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరితో పాటు సీఎంఓ జాయింట్ సెక్రెటరీ సత్యనారాయణ సైతం పరిశీలన చేశారు. ఈ వార్డులో 500 కుటుంబాలు నివసిస్తుండగా వార్డులో ఓటర్లు 1480 మంది ఉన్నారు. డిజిటల్ ఫ్యామిలీ కార్డును అందించేందుకు సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. నివేదిక ఆధారంగా ఈ వార్డులో మొదటిగా కార్డులు పంపిణీ చేస్తారు. అనంతరం మిగతా 19 వార్డులో డిజిటల్ ఫ్యామిలీ కార్డు సర్వేను నిర్వహిస్తారు. దీనికి మరింత సమయం పట్టే అవకాశం ఉంటుందని సంబంధిత శాఖ అధికారుల నుంచి సవ రాచారం. ఈ సర్వే సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య కౌన్సిలర్ లక్ష్మి, కిషన్ రెడ్డి, పాల్గొన్నారు

ఎమ్మెల్సీగా వంగ మహేందర్ రెడ్డిని గెలిపించుకుందాం



నవతెలంగాణ-నంగునూరు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా వంగ మహేందర్ రెడ్డిని గెలిపించుకుందామని పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు ఎర్ర పార్థసారథి, ప్రధాన కార్యదర్శి కల్లపల్లి రామస్వామిలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటర్ నమోదు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పాఠశాలలు, కళాశాలలో ఓటర్ నమోదు పత్రాలను అందించారు. నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్‌లకు సంబంధించిన ఉపాధ్యాయ నియోజకవర్గ పీఆర్టీయూ అధికార అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డికి మద్దతుగా మండలంలోని పాఠశాలల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బొందయ్య, రాజిరెడ్డి, భూపతి రెడ్డి రామరాజు, రాజు రెడ్డి, రవి, నరేశ్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండలి అభ్యర్థిగా వంగ మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-జగదేవపూర్

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యాయ శాసనమండలి అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డికి మద్దతుగా మండల శాఖ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. మండలంలోని ఉన్నత పాఠశాలలకు ఓటు హక్కు ఉన్న ప్రతి ఉపాధ్యాయునికి ఫామ్ 19 ను అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనలో నిరంతరము పోరాడుతూ ఎన్నో జీవోలను తీసుకొచ్చి ఉపాధ్యాయుల సంక్షేమం గురించి పాటుపడే అతిపెద్ద ఏకైక సంఘం అని మండల శాఖ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొద్దు నాయక్, సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, నరసింహారెడ్డి, రఘురాములు, మహిళా ఉపాధ్యక్షులు అనురాధ, కార్యదర్శి రంజిత్ కుమార్, ఉపాధ్యాయ సోదరి సోదరీమణులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డి.ఎ.లు వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వ, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఐదు డిఏ లను వెంటనే చెల్లించాలని టిపిటిఎఫ్ సీనియర్ నాయకులు జి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సమస్యల సేకరణ, సభ్యత్వ క్యాంపెన్లో భాగంగా, సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల, బూరుగుపల్లి , ఇమాంబాద్, మండపల్లి, లింగారెడ్డిపల్లి, నర్సాపూర్, మిట్టపల్లి, బక్రీ చెప్యాల, నాంచార్ పల్లి పొన్నాల తదితర పాఠశాలను సందర్శించి సమస్యలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పట్ల నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని, రావలసిన ఐదు పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని, 2023 జూలై నుండి అమలు చేయాల్సిన పిఆర్సిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు ఉపాధ్యాయ ,ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సాంక్షన్ అయిన స్కావెంజర్ నిధుల్ని వెంటనే సంబంధిత పాఠశాలల అకౌంట్లో వేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు నష్టం చేకూర్చే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు వెంటనే చేకూర్చాలని, రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేసే ఎస్‌జిటి ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుడు రిటైర్ కాగానే రావాల్సిన సౌలాభ్యాలు అన్నీ వెంటనే చెల్లించాలని, మూడు సంవత్సరాల బాండ్ లేదా ఆలస్యంగా డబ్బులు రిలీజ్ చేయడం మూలంగా తీవ్రంగా నష్టపోతున్నారని, కుటుంబ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట అర్బన్ మండల శాఖ అధ్యక్ష ,కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, కృష్ణ రాజేందర్, అశోక్ రెడ్డి, రాజశ్రీ, శ్రీకాంత్ రెడ్డి ,శ్రీకాంత్ , నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి ఆశీర్వదించండి

- పిఆర్‌టియుటీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పించి, ఆశీర్వదించాలని పి ఆర్ టి యు టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి ఉపాధ్యాయులను కోరారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్ పాఠశాలలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన అభ్యర్థిత్వానికి మద్దతు తెలపాలని, సిద్దిపేట బిడ్డగా అవకాశం కల్పించాలని, విద్యారంగా అభివృద్ధికి, ఉపాధ్యాయ వర్గానికి, విద్యార్థుల శ్రేయస్సుకు తగిన విధంగా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని అన్నారు. ఉపాధ్యాయుల, విద్యారంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఓటరు నమోదు సందర్భంగా సందర్శించిన పాఠశాలలు అన్ని మహేందర్ రెడ్డికి మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, సిద్దిపేట అర్బన్ మండల శాఖ అధ్యక్షులు వంగ వెంకట్ రాం రెడ్డి, రాజారెడ్డి, సురేందర్ రెడ్డి, ఆస లక్ష్మణ్, పాతూరి సుజాత, రాజ ప్రభాకర్ రెడ్డి, మనోహర్, విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలు లేక ఆగమవుతున్న రైతులు

- సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభించాలి
- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి



నవతెలంగాణ-కొమురవెల్లి

పత్తి కొనుగోలు కేంద్రాలు లేక రైతులు ఆగమవుతున్నారని ప్రభుత్వం వెంటనే పత్తి కొనుగోలు జరిపేందుకు సీసీఐ కేంద్రాలను ప్రారంభించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి అన్నారు. సీసీఐ కేంద్రాలను ప్రారంభించాలంటూ శుక్రవారం కొమురవెల్లి తహసిల్దార్ లక్ష్మీనారాయణకు పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. అనంతరం సత్తిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఐదు వేలకే క్వింటాలు పత్తిని ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారన్నారు. కేంద్రం ఇచ్చే ఎంఎస్పి క్వింటాలు పత్తికి ధర రూ.7300 ఉన్నా ఉపయోగం లేదని వాపోయారు. వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడి లేక కొద్దిపాటి పత్తి అమ్ముకుందామన్నా ధరలు లేక రైతులు ఆగమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉమ్మడి మండల కేంద్రం చేర్యాల ప్రాంతంలో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రైతులను ఏకం చేసి ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తాజా మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, మండల కమిటీ సభ్యులు తేలు ఇస్తారి, బక్కెల్లి బాలకిషన్, నాయకులు తాడూరు భరత్, కుమార్, నీల బిక్షపతి, సార్ల యాదయ్య, సున్నం యాదగిరి, కర్రోళ్ల ఎల్లయ్య, శ్రవణాచారి ,ఆరుట్ల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దుకోండి

- లయన్ జీఆర్ సూర్య రాజ్



నవతెలంగాణ-మర్కుక్

విద్యార్థి దశలోనే బంగారు జీవితానికి బాటలు వేసుకోవాలి, భవిష్యత్తు అద్భుతంగా తీర్చిదిద్దుకోవాలని లయన్ జీఆర్ సూర్యరాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల మర్కుక్‌లో చదువుతున్న విద్యార్థులకు ఆయన లయన్ అమరనాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశంతో కలిసి నోట్‌బుక్స్, బ్యాగులను అందజేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ పదవతరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు తమ భవిష్యతు తామే నిర్మాతలుగా మారాలని, సామాజిక చైతన్యంతో చదవాలని, దృఢ సంకల్పం ఆత్మవిశ్వాసం, పట్టుదలతో విద్యార్థిలోకం విజయ తీరాలకు చేరాలని సూచించారు. సమావేశాలను నిర్వహించుకునేందుకు షెడ్‌ను, విద్యార్థులకు షూలను అందజేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరితా దేవి, పీఆర్టీయూ మర్కుక్ మండలాధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు వందన, పద్మారెడ్డి, రమణరావు, నాగేశ్వరరావు, సిద్ధయ్య, కవిత, విద్యార్థులు, తదితరులున్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

- పోలీసుల అదుపులో నలుగురు, ఇరువురు పరార్

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని మర్మముల గ్రామ శివారులో పేకాట స్థావరాలపై మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ గురువారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు కలసి పేకాట ఆడుతున్నారని. నమ్మదగిన సమాచారంపై దాడులు నిర్వహించడంతో ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించారని ఆయన తెలిపారు. మర్మముల గ్రామానికి చెందిన ఇప్ప నిష్కాంత్ రెడ్డి, గాజుల యాదగిరి, హైదరాబాద్‌కు చెందిన వంగ రమేష్, చేర్యాలకు చెందిన ఉప్పునూరి శ్రీధర్‌లను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇద్దరు వ్యక్తులు శ్రీధర్, రమేష్‌లు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు, నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.16,990 లు, 5 మొబైల్ ఫోన్లు, 2 కార్లు, 3 మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాలలో ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పదని ఎస్ఐ తెలిపారు.

మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీఎమ్మెల్యే



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్‌లో ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పరామర్శించారు. పట్టణంలోని అరెపల్లెకు చెందిన నమ్మిలికొండ రాజయ్య తండ్రి మృతి చెందారు. మహమ్మదాపూర్ గ్రామంలో పిట్టల రాములు ఇటివల మరణించిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతుడు వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగం మదన్మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు వంగ వెంకట్రామిరెడ్డి, అక్కన్నపేట మాజీ జెడ్పిటిసి భూక్య మంగ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన స్కూల్ గేమ్స్

- ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా క్రీడా పోటీలు
- పోటీలను ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ జిల్లా క్రీడా పోటీలు గవర్నమెంట్ హైస్కూల్‌లో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు, క్రీడలు చాలా అవసరం, ఆరోగ్యంగా ఉంటేనే అన్ని సాధించగలుగుతామన్నారు. ప్రతిరోజు ఒక గంట సమయాన్ని క్రీడలకు కేటాయించాలని, సిద్దిపేట జిల్లా క్రీడారంగంలో రాష్ట్రంలో ముందు వరుసలో ఉండాలన్నారు. చక్కటి ఏర్పాట్లను చేసిన జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌ను అభినందించారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతినిత్యం సాధన చేయవడం వల్ల క్రీడల్లో రాణించగలుగుతామని, గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య మాట్లాడుతూ ఈ క్రీడాపోటీల్లో దాదాపు 2500 మంది క్రీడాకారులు, 150 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ పోటీలకు భోజనం, బహుమతులను వి ఎం ఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగ మహేందర్ రెడ్డి అందిస్తున్నారని, వారికి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, మాజీ ఎస్జీఎఫ్ సెక్రెటరీ రామేశ్వర్ రెడ్డి, పేటా టిఎస్ అధ్యక్షులు తోట సతీష్, అధ్యక్షులు ఏరువా అశోక్, వ్యాయామ ఉపాధ్యాయులు కాటం శ్రీనివాస్ ,కదుర్ల హరికిషన్, రమణారెడ్డి, బిక్షపతి, సుజాత, వెంకటస్వామి, ఉప్పలయ్య, మురళీధర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దూషించాడని వ్యక్తి హత్య

- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



నవతెలంగాణ-మద్దూరు

అక్రమ సంబంధాలు పెట్టుకొని ఎంతమంది కుటుంబాలను కాలుస్తావురా అని తిట్టినందుకు అతనిపై పగ పెంచుకొని ఓ పథకం ప్రకారం ఆ వ్యక్తిని హత్య చేసిన ఘటన మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం చేర్యాల సిఐ శ్రీను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దూల్మిట్ట, మండలంలోని బెక్కల్, గ్రామానికి చెందిన బైరగోని యాదయ్య (52) పరిసరాలలో బైరాన్ పల్లి గ్రామానికి చెందిన నందన బోయిన బాలకృష్ణ సంచరిస్తుండడంతో యాదయ్యకు అనుమానం వచ్చింది. ఈనెల 13న ఉదయం 11 గంటలకు యాదయ్య కుటుంబ సభ్యులలో ఒక పాపకు అనారోగ్యం గురికావడంతో చికిత్స కోసం బైరాన్ పల్లి గ్రామానికి బాలకృష్ణ బైక్‌పై తీసుకు వెళ్ళేందుకు ప్రయత్నిస్తుండగా ఆ సమయంలో ఇంట్లో ఉన్న యాదయ్య బయటకు వచ్చి ఇంకా ఎంతమంది సంసారాలు కూల్చుతావురా అంటూ బాలకృష్ణను తిట్టాడు. ఉదయం యాదయ్య తిట్టిన మాటలను బాలకృష్ణ మనసులో పెట్టుకొని సాయంత్రం మూడు గంటలకు యాదయ్య దగ్గరికి వచ్చి కల్లు తాగినట్టు చేసి మనము మందు తాగుదామని నమ్మించడంతో కూటిగల్ వైన్స్‌కు ఇరువురి వాహనాల పైన వెళ్లారు. కూటిగల్ వైన్ షాపులో బాలకృష్ణ మద్యం తీసుకొని యాదయ్యను బైక్‌పై ఎక్కించుకొని కూటిగల్ శివారు బ్రిడ్జి సమీపంలోకి తీసుకువెళ్లి అక్కడ మద్యం సేవించి అప్పటికే మద్యం మత్తులోకి జారుకున్న యాదయ్యను ఒక దొడ్డు కర్రతో తలపై బలంగా కొట్టడంతో యాదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటినుండి బాలకృష్ణ పరారీలో ఉన్నాడు. మృతుని భార్య లక్ష్మి తన భర్త ఈనెల 13న ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు 14వ తేదీన పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తుండగా ఈనెల 15న కూటికల్ బ్రిడ్జి వద్ద యాదయ్య మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు యాదయ్యను హత్య చేసినట్లుగా గుర్తించారు. దర్యాప్తులో భాగంగా శుక్రవారం నందన బోయిన బాలకృష్ణను పట్టుకున్న పోలీసులు విచారించగా తానే యాదయ్యను హత్య చేసినట్లుగా నిందితుడు ఒప్పుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్సై షేక్ మహబూబ్, ప్రొబేషనరీ ఎస్సై అరుణ్ కుమార్, ఏఎస్ఐ విజయ్ కుమార్, తదితరులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేయించాలి



నవతెలంగాణ-కొమురవెల్లి

పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ కోసం వ్యాక్సిన్ వేయించాలని కొమురవెల్లి పశు వైద్యశాల ఉప వైద్యాధికారి మనోహర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని గౌరయపల్లిలో పశువులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి నవంబర్ 14వరకు మండలంలోని అన్ని గ్రామాలలో గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఈ ఓ పాషా, సిబ్బంది రాజు ఉన్నారు.

హరితహారం మొక్కలు మాయం

- ఏపుగా పెరిగిన చెట్లు నరికివేత



నవతెలంగాణ-కొండపాక

పచ్చదనం కోసం హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకి ఇరువైపున మొక్కలు నాటి వాటిని సంరక్షించి పెద్దగా చేశారు. అలాంటి పెద్దగా పెరిగిన మొక్కలను కొంతమంది స్వార్థానికి నరికి వేసిన వైనం కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారి పక్కన చోటుచేసుకుంది. ఫారెస్ట్ అధికారులు గతంలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ వచ్చారు. తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారి పక్కన భూ యజమానులు వారి అవసరాల కోసం సుమారు పదికి పైగా చెట్లను నరికివేసి ఏర్పడకుండా మట్టి పోశారు. ఈ విషయమై ఫారెస్ట్ సెక్షన్ అధికారి రమేష్ ను వివరణ కోరగా విచారణ చేపడతామని తెలిపాడు.

మహిళలు ఆర్థికంగా సామాజికంగా బలోపేతం కావాలి

- కమిషనర్ నరసయ్య



నవతెలంగాణ-గజ్వేల్

మహిళలు ఆర్థికంగా సామాజికంగా బలోపేతం కావాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నా రు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘం సభ్యులకు యూనియన్ బ్యాంక్ వారు ఇచ్చిన రుణం సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందుతున్నారన్నారు. ఇంద్ర మహిళా శక్తి పథకంలో నిధుల ద్వారా జూటు బ్యాగుల తయారీ, స్టీల్ బ్యాంకులను తయారు చేస్తున్నారన్నారు. తయారీలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మెప్మా సిఓ సరిత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



నవ తెలంగాణ-దుబ్బాక

రాష్ట్రస్థాయి పోటీలకు లచ్చపేట మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎస్.బుచ్చిబాబు తెలిపారు. ఈ నెల 17న సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీటీసీ భవన్‌లో "పాఠశాల విద్యాశాఖ-సమగ్ర శిక్ష" సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి "కళా ఉత్సవ్" పోటీల్లో భాగంగా 6 విభాగాలకుగాను 3 విభాగాల్లో దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఏ.చామంతి-ఏకపాత్రాభినయంలో, సీహెచ్.యశ్వంత్ - సంగీతంలో, బీ. క్రాంతి కుమార్- పెయింటింగ్‌లో ప్రథమ స్థానం సాధించి నవంబర్ లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులు నాగరాజు, నరేష్, భవాని, మదన్ మోహన్, జ్యోతిలను ఎంఈఓ జే.ప్రభుదాస్, ప్రిన్సిపల్ ఎస్.బుచ్చిబాబు అభినందించారు.

పలు దేవాలయాల్లో చోరీ



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం పలు గ్రామాల్లోని దేవాలయాల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. కొండపాక రుద్రేశ్వరాలయంలో గుర్తుతెలియని దుండగులు గల్లాపెట్టెను పగలగొట్టే ప్రయత్నం చేసి రాకపోయేసరికి గల్లా పెట్టెను కొంత దూరం తీసుకెళ్లి చెరువు కట్ట చెట్ల పొదల్లో వదిలేసి వెళ్లారు. అలాగే రవీంద్ర నగర్ హనుమాన్ దేవాలయం గల్ల పెట్టెను తీసుకెళ్లి పగులగొట్టి అందులోనే డబ్బును తీసుకొని కొద్ది దూరంలో పొదల్లో వేశారు. అంకిరెడ్డిపల్లి ఎల్లమ్మ దేవాలయంలో చొరబడి గల పెట్టెను పగలగొట్టి డబ్బులను తీసుకెళ్లారు. దేవాలయ ట్రస్ట్ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరు పల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

మత్తు పదార్థాల గురించి విద్యార్థులకు అవగాహన


- మత్తు పదార్థాల బారిన పడి జీవితం నాశనం చేసుకోవద్దు



నవతెలంగాణ-తొగుట

మత్తు పదార్థాల వల్ల అనేక వ్యాధులు సంక్రమిస్తాయని హెల్త్ సూపర్‌వైజర్ తార తెలిపారు. శుక్రవారం మండలంలోని కాన్గల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, సిగరెట్, తంబాకు, గుట్కా, పాన్ పరాక్ వంటి మత్తు పదార్థాలతో అనేక వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. గుండె, ఊపిరి తిత్తులు, క్యాన్సర్‌లాంటి వ్యాధులు సోకి ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా మంచి జీవితం అనుభవించే విధంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెల్త్ అసిస్టెంట్ నక్క రాములు, ఏఎన్ఎం అను రాధ, ఆశా కార్యకర్తలు మహేశ్వరి, పుష్పలత, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం పోతారం (జె) గ్రామంలో దుర్గామాత నిమజ్జనానికి పెట్టిన డీజే వద్ద విద్యుదా ఘాతానికి గురై బీఆర్ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు శిఖ తిరుపతి కూతు రు కీర్తన్య అనే చిన్నారి మృతి చెందింది. అలాగే ఇటీవల నందారం గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ కొట్టే శ్రీనివాస్ రెడ్డి సోదరుడు కొట్టే సుధాకర్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ శుక్రవారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భూక్యా మంగ, మాజీ మార్కెట్ చైర్మన్లు లింగాల సాయన్న, ఎడబోయిన తిరుపతి రెడ్డి, హుస్నాబాద్ వార్డు కౌన్సిలర్ బొజ్జ హరీష్, నాయకులు కరివేద నరేందర్ రెడ్డి, చిట్యాల సంపత్, తిరుపతి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-మద్దూరు

చేర్యాల మండలంలోని అర్జున పట్ల, గ్రామంలో ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్న లింగాల బాలయ్య బెల్ట్ షాప్‌పై మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ శుక్రవారం దాడి చేసి 19 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమమద్యాన్ని విక్రయిస్తున్న లింగాల బాలయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పెంచిన విడిఏ అమలు చేయాలి

- అన్ని పరిశ్రమల్లో బోనస్ ఇవ్వాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ-మర్కుక్

జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ పరిశ్రమల్లో ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ ప్రకారం వీడిఏ అమలు చేయాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పెంచిన వీడిఏ కరువు భత్యం 1849 నుండి 1888 అనగా 39 పాయింట్లు పెరిగిందని జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, గౌరారం, కర్కపట్ల, ములుగు, బండ మైలారం , కొత్తూరు పారిశ్రామిక ప్రాంతాల్లోని పరిశ్రమల్లో కనీస వేతనాల జీవోలు సక్రమంగా అమలు చేయడం లేదని కార్మికులందరికీ ఈఎస్ఐ, పిఎఫ్, బోనస్, గ్రాట్యుటి చట్ట పరమైన సౌకర్యాలు అమలు చేయడం లేదన్నారు. ఫార్మా, సీడ్ పరిశ్రమల్లో బెల్లము , గ్లౌజులు, మాస్కులు ఇవ్వడం లేదని మహిళలకు రక్షణ సౌకర్యాలు లేకుండా పని చేయించడం జరుగుతుందని ఆరోపించారు. పరిశ్రమలలో అక్రమంగా తొలగిస్తూ వేధింపు పాల్పడడం జరుగుతుందన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బ్యాంకు ద్వారా వేతనాలు అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికులకు బోనస్ ఇవ్వని పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో పక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని పరిశ్రమల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- కార్మిక,ఉపాధి కల్పన ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆధునాతన కోర్సులలో ప్రవేశాలకు అర్హత, ఆసక్తి,గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి కార్మిక,ఉపాధి కల్పన, శిక్షణ ఫ్యాక్టరీస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్, డైరెక్టర్ కృష్ణ ఆదిత్యతో కలిసి అడ్వాన్స్ ట్రైనింగ్ కేంద్రాల్లో అడ్మిషన్స్ ప్రక్రియ నిర్వహణపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఐటిఐ ప్రిన్సిపాల్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి ఐడిఓసి కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా అడ్వాన్స్ ట్రైనింగ్ కేంద్రాలు ద్వారా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ తెలిపారు.నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పనకు ఏటీసీ కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు.ఈ నెల 31 వరకు అడ్మిషన్ల గడువు పెంచినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి మాట్లాడుతూ శిక్షణ కేంద్రాలు వృత్తి శిక్షణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమ అవసరాలను దృష్టితో 10వ తరగతి ఆపై విద్యార్హత గల విద్యార్థులకు ఈ నెల 31 వరకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఏటీసీ కేంద్రాల్లో అడ్మిషన్ల ప్రక్రియ పర్యవేక్షణకు డీఆర్డీఓను ప్రత్యేక నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. జిల్లాలో నిర్దేశిత లక్ష్యం మేరకు 172 మంది విద్యార్థులను ఏటిసి కేంద్రాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని కుకునూర్ పల్లి ఏటీసీ ప్రిన్సిపాల్ వెంకటరమణను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-బెజ్జంకి

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ(ఎం)గ్రామ శాఖ సమావేశానికి సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా హమాలీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆకస్మికంగా ప్రమాదాలు సంభవిస్తే ఎలాంటి నష్టపరిహారం అందడం లేదని.. ప్రమాద పరిహారం అందించేలా ప్రభుత్వం చొరవ చూపాలని సూచించారు. పీఎఫ్, ఈఎస్ఐ గుర్తింపు కార్డులు కల్పించి అన్ని విధాల సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా హమాలీ కార్మికుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శిగా సంఘ ఎల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం)జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్, నాయకులు ఎల్లయ్య, చంద్రయ్య, సత్తయ్య, రాజు, శ్రీను చంద్రయ్య నర్సింగ్, చంద్రం నాయకులు తదితరులు పాల్గొన్నారు

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

- 100 కాల్ వెంటనే స్పందించాలి
- పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ను, సిద్దిపేట రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని శుక్రవారం పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ సందర్శించారు. అనంతరం పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలను సీజ్ చేసిన వాహనాలను రిసెప్షన్ ఏరియాను పార్ట్ 2 మ్యాప్‌ను మాల్ రూమును పోలీస్ సిబ్బంది కిట్ ఆర్టికల్ ను, రెస్ట్ రూమ్లను రికార్డ్ రూమ్ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి సాధ్యమైనంత త్వరగా స మస్యలు పరిష్కరించాలన్నారు. 100 కాల్‌కు వెంటనే రె స్పాండ్ కావాలన్నారు. ఏ సంఘటన జరిగినా తప్పకుండా ఎస్ఐ సందర్శించాలన్నారు. ప్రతి కేసులో పారదర్శకంగా క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని తెలిపారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి దరఖాస్తుకు రిసిప్ట్ ఇవ్వాలని రిసెప్షన్ సూచించారు. అంకితభావంతో విధులు నిర్వహించాలని అదే సమయంలో ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని సూచించారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై విధు లు నిర్వహించాలని సూచించారు. విపిఓ విలేజ్ పోలీస్ ఆఫీసర్ బుక్స్ తనిఖీ చేశారు, గంజాయి, డ్రగ్స్ మరియు ఇతర మత్తుపదార్థాల వల్ల కలిగే పర్యవసానాల గురించి స్కూల్ లలో కాలేజీలలో గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలు అమ్మే వారిపై సేవించే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలను ఉక్కు పాదంతో అణిచివేయాలని తెలిపారు. గ్రామాలలో మండల కేంద్రంలో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహించే వారిపై నిఘా పెంచాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని సూచించారు. పోలీస్ అధికారులు సిబ్బంది తరచుగా గ్రామాలను సందర్శించి ప్రజల సాధక బాధకాలు తెలుసుకోవాలని సూచించారు. ఇన్ఫర్మేషన్ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలన్నారు. ప్రజల రక్షణకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. నూతన చట్టాల గురించి గ్రామాలలో మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పాత నేరస్తులైన కేడీలు డీసీలు సస్పెక్ట్ లను తరచుగా తనిఖీలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపి మధు, సిద్దిపేట రూరల్ సిఐ శ్రీను, ఎస్బిఐ ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి, రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, బెజ్జంకి ఎస్ఐ కృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ ఉపకార వేతనాలను విడుదల చేయాలి


- బిఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి శర్దని రాము



నవతెలంగాణ-రాయపోల్

పెండింగ్ ఉపకార వేతనాలను మరియు ఫీజు రీయంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి శర్దని రాము డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడు యేండ్ల నుంచి రూ.6 వేల కోట్లకు పైగా పెండింగ్ లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయంబర్స్ మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేటు కళాశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలేజీ యాజమాన్యాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్ జీతాలు ఇవ్వలేక సతమతమవుతున్నారని, కళాశాల భవనాల అద్దెలు చెల్లించకపోతున్నారని కళాశాలలు మూసివేసుకునే పరిస్థితి వస్తుందన్నారు. దాని ద్వారా విద్యార్థులు నష్టపోతారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ప్రైవేటు కళాశాలల యజమాన్యాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని వెంటనే ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్మెంట్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రాయపోల్ విద్యుత్ ఏఈఈగా శ్రీనివాసరావు



నవ తెలంగాణ-రాయపోల్

రాయపోల్ విద్యుత్ శాఖ ఏఈఈగా శ్రీనివాసరావు శుక్రవారం మండల కేంద్రం సబ్ స్టేషన్ కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. గతంలో తొగుట మండలం ఏఈఈగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు బదిలీపై రాయపోల్ మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయపోల్ మండలంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తూ నాణ్యమైన విద్యుత్ రైతులకు, గృహ వినియోదారులకు అందించేందుకు కృషి చేద్దామని ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వినియోదారులు, ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన విత్తనాలు ఎరువులనే విక్రయించాలి

- వ్యవసాయ అధికారి నరేష్



నవతెలంగాణ-రాయపోల్

రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎరువులను మాత్రమే ఫర్టిలైజర్ దుకాణ యజమానులు విక్రయించాలని వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణాలలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఫర్టిలైజర్ దుకాణాలలో రైతులు విత్తనాలు కానీ ఎరువులు కానీ కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు విక్రయాలు జరిపితే ఉపేక్షించేది లేదన్నారు. విత్తనాలు, పురుగుల మందులు, ఎరువుల స్టాక్ రిజిస్టర్ విధిగా నిర్వహించాలన్నారు. కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు రైతులకు విక్రయించినట్లయితే అటువంటి ఫర్టిలైజర్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. ఫర్టిలైజర్ దుకాణాలు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం ఫర్టిలైజర్ డీలర్లు పాల్గొన్నారు.

ఒక్క ఓటీపీ మిమ్మల్ని నట్టేట ముంచేస్తుంది

- ఫోన్లో వచ్చిన లింకును ఓపెన్ చేస్తే మీ అకౌంట్ నిల్ అవుతుంది

నవతెలంగాణ-మిరుదొడ్డి

సైబర్ నేరగాళ్ల రోజురోజుకు వారి ఆగడాలకు అడ్డులేకపోయింది. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్తరకమైన మోసాలకు పాల్పడుతున్నారు. గ్రామాల్లో కొంతమంది అమాయకులతో ఫోన్ కాల్ చేస్తూ మేము మీకు బ్యాంకు ద్వారా ఫోన్ చేస్తున్నాము మీ యొక్క అకౌంట్ ఆగిపోయింది. మీరు ఈ కేవైసీ చేసుకోవాలనే సాకుతో సామాన్యుల బ్యాంక్ ఖాతా నుండి డబ్బులు మాయం చేస్తూ కాలయాపన చేస్తున్నారు. యువకులు. ఆన్లైన్లో అందుబాటులో ఉన్న సాంకేతిక పద్ధతులు ద్వారా మీ యొక్క వివరాలను సేకరించి అక్కడి నుండి మీయొక్క స్కీం పేరుతో చెబుతూ వారిని మోసం చేసే మాదిరిగా మాట్లాడుతారు. గ్రామాల్లో పేద ప్రజలను మోసం చేస్తూ ఫోన్ ద్వారా కాల్ చేస్తున్న సైబర్ నేరగాలను నమ్మవద్దు. సిద్దిపేట జిల్లాలో నేటికీ చాలామంది అమాయకులు సైబర్ నేరాల పట్ల ఎంతోమంది అమాయకులు బలహీన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. మిరుదొడ్డి మండలం మల్లు పల్లిలో గుల్ల కుమార్ అనే యువకుడు సైబర్ నేరస్తులకు బలి బలి అయ్యి రూ.2 లక్షలు నష్టపోయాడు. సిద్దిపేట జిల్లా కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎన్నో సైబర్ నేరస్తుల పట్ల నష్టపోయిన వారు ఎందరో ఉన్నారు. ఎవరికైనా సంబంధం లేకుండా బ్యాంకు నుంచి మేము కాల్ చేస్తున్నామని చెప్తే వారికి మీ యొక్క వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి కూడా అందించవద్దు. ఎక్కువగా మీయొక్క లోన్ పెండింగ్ అయిందని, మీకు డబ్బులు రావాలంటే కొంత అమౌంట్ చెల్లిస్తే మీకు ఎక్కువ మొత్తంలో అమౌంట్ వస్తుందని చెబుతూ సైబర్ నేరస్తులు కొంతమందిని ఫోన్ లో చెబుతూ నమ్మిస్తూ వారిని మోసం చేస్తున్నారు. ప్రజలు ఎవరు వారిని నమ్మకూడదు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు పాటించాలి

సైబర్ నేరాలు ఎవరికైనా ఫోన్ కాల్ చేస్తే వారికి మీ యొక్క వ్యక్తిగత సమాచారం ఇవ్వకుండా వెంటనే సైబర్ క్రైమ్ లేదా సంబంధిత పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలి. మీ యొక్క వ్యక్తిగత సమాచారం మరియు బ్యాంక్ అకౌంట్ ఓటీపీలు వంటివి ఎవరికి చెప్పవద్దు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బ్యాంకు వారు పేరు చెప్పి వారు మీయొక్క ఓటిపి ఆధార్ కార్డు నెంబర్ చెప్పమంటారు, మీ వ్యక్తిగత సమాచారం ఎవరికి ఇవ్వటం మంచిది కాదు మీకు ఏదైనా సమాచారం కావాలంటే స్వయంగా బ్యాంకు వద్దకు వెళ్లి కలవాలి.



ఎస్సై పరశురాం

సీఎం కుర్చీ కోసం ఢిల్లీకి డబ్బు సంచులు

- బీఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జి వంటేరు ప్రతాపరెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

పది నెలలుగా సీఎం కుర్చీని లాక్కున్నందుకు సొంత పార్టీ నాయకులు ప్రయత్నం చేస్తుండగా దాన్ని కాపాడుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పెద్దలకు డబ్బు సంచులు జార వేస్తున్నారని బీఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జి వంటేరు ప్రతాపరెడ్డి ఆరోపించారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సొమ్మును తన పదవి కాపాడుకునేందుకు కాంగ్రెస్ ఢిల్లీ నేతలకు జేబులు నింపుతున్నారని ఆయన విమర్శించారు. ఇందులో భాగంగానే మూసి నది పరిహారక ప్రాంతాన్ని సుందరీకరణ పేరుతో లక్ష కోట్ల దోపిడి చేసి తన కుర్చీని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన చెప్పారు. మల్లన్న సాగర్ ముంపు ప్రాంతాలకు రూ 448 కోట్లు వెంటనే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సచివాలయం, కార్యాలయాల్లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పడం కాదని సీఎంకు దమ్ము ధైర్యం ఉంటే గజ్వేల్‌కు రావాలని ఆయన సవాల్ చేశారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి చూపిస్తామన్నారు. కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ లను విమర్శిస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ దోపిడి దొంగల ముఠాగా మారిందన్నారు. పది నెలల్లోనే వేల కోట్లు అప్పులు చేసి తెలంగాణ ప్రజలపై భారం మోపుతున్నట్టు ఆయన విమర్శిం చారు.

చర్చకు వస్తే వెయ్యి మందితో స్వాగతం

మల్లన్న సాగర్ ప్రాంతానికి చర్చకు వస్తే వెయ్యి మంది కార్యకర్తలతో ఘన స్వాగతం పలుకుతానన్నారు. గత ఎన్నికల్లో మల్లన్న సాగర్ నిర్వాసితులు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పినా ఫలితం లేకుండా పోయిందన్నారు. తెలంగాణ ప్రజలకు మాయమాటలు చెప్పి కాలం గడుపుతున్న సీఎం రేవంత్ రెడ్డికి గజ్వేల్ ప్రజలు తగిన బుద్ధి చెప్తారని ఆయన చెప్పారు. ప్రాజెక్టులు నిర్మించి తెలంగాణ ప్రాంతంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ఘనత కేసిఆర్‌కు దక్కుతుందన్నారు. 420 హామీలు అబద్ధంగా ఇచ్చి చేతులు దులిపేసుకున్న ఘనత రేవంత్ రెడ్డికి ఉందని ఆయన విమర్శించారు.

నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్‌పై అవగాహన



నవ తెలంగాణ - సిద్దిపేట

నూతన ఉపాధ్యాయులకు టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్వీస్ రూల్స్‌పై ఈ నెల 20వ తేదిన ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు టీఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ డీఎస్సీ 2024 ద్వారా సిద్దిపేట జిల్లాలో నియామకమైన 256 మంది ఉపాధ్యాయులకు ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసే సమావేశంలో సర్వీస్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక బాలికల పాఠశాల, ప్రభుత్వ బాలికలు ఉన్నత పాఠశాల, ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భారత్ నగర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియం, హనుమాన్ నగర్ ప్రాథమిక పాఠశాల, రంగదాంపల్లి ఉన్నత పాఠశాలలోని నూతన ఉపాధ్యాయులను కలిసి అవగాహన సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్, లీవ్ రూల్స్ పైన పూర్తి అవగాహనను కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ-నూతన ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై సందేశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ప్రధాన వక్తగా సర్వీస్ రూల్స్ పైన సమగ్రమైన అవగాహన కలిగిన టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ .వెంకట్ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని నూతనంగా నియామకమైన ఉపాధ్యాయులందరూ సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు బి .రాకేష్ , ఎండి ఇస్మాయిల్, ఎం కనకరాజు, ఎండి లతీఫ్ మరియు నూతన ఉపాధ్యాయులు నరేష్, శ్రీకాంత్, అన్వేషిత, ఉమేరా బేగం పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడ్డ వారికి మాత్రమే పదవులు ఇవ్వాలి



నవతెలంగాణ-సిద్దిపేట

పార్టీలో కష్టపడ్డ వారికి మాత్రమే పదవులు ఇవ్వాలని, లేకుంటే చూస్తూ ఊరుకోమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ కో కన్వీనర్ నాయిని నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన వారికి పదవులు ఇస్తే ఊరుకోబోమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి పది నెలలు అయినా ఇంకా సిద్దిపేటకు నామినేటెడ్ పదవులు రాకపోవడానికి కారణం ఐక్యత లేకపోవడమేనన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వట్టిపల్లి రాజిరెడ్డి, ఎద్దురాజ్ యాదవ్, కోటగిరి ఎల్లవ్వ, తొండేగల రజనీ, సన, మార్క చంద్రశేఖర్, నాయిని సురేందర్, ఉప్పెన రాజశేఖర్‌పాల్గొన్నారు

హైదరాబాద్ తరలిన సైకిల్ క్రీడాకారులు



నవతెలంగాణ-సిద్దిపేట

18 నుండి 20వ వరకు ఓయూ వెలోడ్రోంలో జరుగు ట్రాక్ సైకిల్ ఛాంపియన్షిప్ పోటీలకు సిద్దిపేట ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ నుండి క్రీడాకారులు వెళ్తున్నట్లు కోచ్ సంజీవ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ వెళుతున్న క్రీడాకారులను డివైఎస్ఓ జయదేవ్ ఆర్య, సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శులు వెంకట్ నరసయ్య, శ్రీనివాసులు, అశోక్, గర్ల్స్ హై స్కూల్ పిడి సుజాత, అండర్ 19 ఎస్ జి ఎఫ్ సెక్రటరీ సమ్మయ్య, వెంకటేష్, ఫుట్బాల్ అసోసియేషన్ అక్బర్ వివిధ క్రీడా సంఘాల కార్యదర్శి అధ్యక్షులు అభినందనలు తెలిపారు.